లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి జూనియర్ సివిల్ జడ్జి రమేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 1000 మంది బాలురకు 978 బాలికలు ఉన్నారన్నారు. లింగ నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. బాలికలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వారిపై వివక్ష చూపకూడదన్నారు. ఏ లేబరేటరీ, స్కానింగ్ కేంద్రం లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదన్నారు. సమాచారం తెలిస్తే 102, 104 టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా తెలియజేయాలని కోరారు. కలిసికట్టుగా లింగవివక్షకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఏఎన్‌ఎంలు, ఆశలు గృహ సందర్శనలు చేసేలా చూడాలన్నారు. నూతన వధూవరులు, గర్భిణికి, అత్తమామలకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 73 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా 11 కేంద్రాలు గుర్తింపు దరఖాస్తు చేసుకున్నాయని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. బాలికలు సంరక్షణపై ప్రచారం చేస్తున్నామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: చట్టపరిధిలోని ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు జిల్లా ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. అనకాపల్లి జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 26 ఫిర్యాదులు వచ్చాయి. భూ సమస్యలు. కుటుంబ కలహాలు, ఛీటింగ్ కేసులు ఎక్కువగా వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చట్ట పరిధిలోని సమస్యను వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ దేవప్రసాద్ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో రజతం


మౌనిక

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: హరియాణాలో ఈ నెల 13 వరకు జరిగిన సీనియర్స్ యూత్ నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నంకు చెందిన బొంతు మౌనిక రజత పతకం సాధించిందని శాప్ కోచ్ అబ్బు, సీనియర్ కోచ్ శేఖర్ తెలిపారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పతకంతోపాటు రూ.20 వేలు నగదు పురస్కారం అందుకున్న మౌనిక ఇండియన్ యూత్ బాక్సింగ్ శిబిరానికి ఎంపికైందన్నారు.

విద్యుత్తు సిబ్బంది అప్రమత్తం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో జిల్లాలో ఎక్కడ విద్యుత్తు సమస్యలు తలెత్తినా 94906 10022, 1912కు ఫోన్ చేయవచ్చని ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. కలెక్టర్, ఈపీడీసీఎల్ ఎండీ ఆదేశాల మేరకు జిల్లాలో విద్యుత్తు విభాగం అధికారులను అప్రమత్తం చేశామన్నారు. 24 గంటలూ అధికారులను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. వర్షాల కారణంగా తెగిపడిన తీగలు, తడిసిన స్తంభాలు, తీగలపై పడిన చెట్టు కొమ్మలను ప్రజలు ఎవరూ తాకవద్దన్నారు.

మెగా ఉద్యోగ మేళా రేపు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా ఉద్యోగ మేళా జరగనుందని ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ తెలిపారు. కళాశాల స్కిల్ హబ్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుందన్నారు. అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, హెల్త్‌కేర్ సంస్థలు హాజరు కానున్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 94947 91935 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

వ్యూహం ఎందరిదో.. దక్కింది కొందరికే!!


లాటరీలో దుకాణం దక్కిన వారు నగదు చెల్లిస్తూ...


నగదును లెక్కిస్తున్న సిబ్బంది

★ జిల్లాలో పూర్తయిన మద్యం దుకాణాల కేటాయింపు
★ రూ. కోట్లు ఖర్చు చేసినా కొందరికి నిరాశే


అనకాపల్లిలో లాటరీ తీస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్


అనకాపల్లి పట్టణం, విశాఖపట్నం, న్యూస్‌టుడే

అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో ప్రైవేటు వ్యాపారులకు మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా జరిగింది. అనకాపల్లిలో కలెక్టర్ విజయకృష్ణన్ చేతులమీదుగా లాటరీ ప్రక్రియను ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 136 మద్యం దుకాణాలకు 3214 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో ఒక్కో దుకాణానికి 17 నుంచి 28 వరకు దరఖాస్తులు రావడంతో వీరికి అందరి సమక్షంలో టోకెన్లు కేటాయించారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్ అందరి సమక్షంలో లాటరీ తీశారు. దరఖాస్తుదారుల్లో మహిళలు అధికంగానే ఉన్నారు. కొంతమంది మహిళలు తమ పిల్లలతో సహా లాటరీ కేంద్రానికి వచ్చారు. దుకాణాలు దక్కించున్న వారు డిపాజిట్ నగదు చెల్లించిన వెంటనే అనుమతులు ఇవ్వనున్నారు. ఈనెల 16 నుంచి ఈ దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. అనకాపల్లి ఆర్‌డీఓ షేక్ ఆయిషా, జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి సుధీర్, ఎక్సైజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

★ విశాఖ జిల్లాలో మద్యం దుకాణాల కోసం రాష్ట్రేతరులు కూడా పోటీపడ్డారు. విశాఖ జిల్లాలో మొత్తం 155 దుకాణాలకు 4,129 మంది దరఖాస్తులు రాగా విజేతలను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో లాటరీ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభించగా మధ్యాహ్నం ఒంటిగంటకు పూర్తయింది. కలెక్టరు హరేంధిర ప్రసాద్ మొదటి లాటరీ తీశారు. ఆ తర్వాత సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ ఆధ్వర్యంలో కొనసాగించారు.

ఓ వ్యక్తి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలోని కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లుతో రూ.3.36 కోట్లతో విశాఖ జిల్లాలో 168 దుకాణాలకు దరఖాస్తు చేయిస్తే...11 దుకాణాలు దక్కాయి.

అనకాపల్లికి చెందిన ఓ పాత మద్యం వ్యాపారి జిల్లాలో 80 దరఖాస్తులు వేయగా మూడు వచ్చినట్లు సమాచారం. గతంలో మద్యం వ్యాపారం చేసిన వారిలో చాలామంది దరఖాస్తు వేశారు.


ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల వారీగా వివరాలివీ
■ దుకాణాలు
■ దరఖాస్తులు

ఎక్సైజ్ పోలీస్ స్టేషన్	దుకాణాలు	దరఖాస్తులు
అనకాపల్లి	15	372
సబ్బవరం	19	327
నర్సీపట్నం	21	543
గొలుగొండ	8	234
ఎలమంచిలి	20	560
చోడవరం	22	530
మాడుగుల	13	284
పాయకరావుపేట	22	364


అనకాపల్లిలో హాజరైన మహిళలు

» కొందరు 'లక్కీ నంబర్లు' ప్రకారం దరఖాస్తు చేశారు. విశాఖపట్నంలో ఓ వ్యక్తి తనకు 9వ నంబరు కలిసొస్తుందని 9 దరఖాస్తులు చేశారు. అయితే ఆయనకు ఎటువంటి దుకాణం రాలేదు. మరో వ్యక్తి ఆరు నంబరు కలిసొస్తుందని ఆరు దరఖాస్తులు వేసినా అదృష్టం కలిసిరాలేదు. మొదటిసారి సరదాగా చేసిన కొందరికి అదృష్టం వరించింది.

» విశాఖ జిల్లాలో దుకాణాలకు దిల్లీ, నొయిడా నుంచి కూడా దరఖాస్తు చేశారు. వీరిలో కొందరు వందకుపైగా దరఖాస్తులు చేయగా పది వరకు వచ్చినట్లు సమాచారం. ఒడిశాకు చెందిన కొందరికి దుకాణాలు వచ్చాయి. తెలంగాణ నుంచి కొందరు పాల్గొన్నారు.

» **మేము సైతం:** లాటరీ కేటాయింపుల్లో కొందరు మహిళలను అదృష్టం వరించింది. 155 దుకాణాల్లో 31 మహిళలకు వచ్చాయి. కొందరికి రెండు, మూడేసి దక్కాయి. వీరిలో కొందరు వ్యాపారులు, గృహిణులు ఉన్నారు. ఆయా కుటుంబ సభ్యుల్లో బంధువుల పేరుతో కొత్తగా చేసిన వారికి కొన్ని దక్కాయి. చాలామంది మహిళలు దరఖాస్తు చేసినా... లాటరీకి హాజరైంది తక్కువే.

సిండికేట్ అలా

గతంలో మద్యం వ్యాపారం సాగించిన కొందరు ఎలాగైనా దుకాణాలను దక్కించుకోవాలనే ఉద్దేశంతో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, వారి వద్ద పనిచేసే వ్యక్తులతో దరఖాస్తు చేయించారు. ఇలా ఓ వ్యక్తి వంద వరకు దరఖాస్తు చేయిస్తే 20 వరకు దుకాణాలు దక్కినట్లు సమాచారం. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి పది వరకు దక్కాయి. కొందరు దరఖాస్తులు వేసినా ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

తక్కువ 20..గరిష్ఠంగా 41

విశాఖ జిల్లాలో దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు సగటున 25 వరకున్నాయి. అత్యధికంగా 82వ దుకాణానికి 41 రాగా, అత్యల్పంగా 20 వచ్చినవి రెండు దుకాణాలున్నాయి. 26 దరఖాస్తులు చేసినవి 23 వరకు ఉన్నాయి. 23 చొప్పున 18 దుకాణాలకు వచ్చాయి. 24 చొప్పున వచ్చినవి 11, 25 చొప్పున వచ్చినవి 13 ఉన్నాయి.


విశాఖలో లాటరీకి వచ్చిన మహిళలు


అనకాపల్లిలో పిల్లాడిని ఆడిస్తూ..

ఆట్యాపాట్యా.. తిరుగేలేదిక!

నర్సీపట్నానికి అగ్రస్థానం

తొలిసారిగా జాతీయ పోటీలకు ఇక్కడి బాలలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

ఆట్యాపాట్యా.. ఆ ఆట గురించి కొద్దిమందికే తెలుసు. ఇందులో నర్సీపట్నం విద్యార్థులు మాత్రం మంచి ప్రతిభతో రాణిస్తున్నారు. ఏకంగా ఈ క్రీడలో వీరు జాతీయ పోటీల్లో పాల్గొని తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ క్రీడలో అనకాపల్లి జిల్లా నుంచి ఈ స్థాయికి చేరుకున్న తొలి బాలలుగా వీరు గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఇందులో మరింత రాణించి క్రీడా కోటాలో ఉన్నతస్థాయి ఉద్యోగాన్ని సాధించాలనే లక్ష్యంతో వీరు మరింత సాధన చేస్తున్నారు.



ఒకప్పుడు ఉప్పు ఆటగా ఆట్యాపాట్యాగా గుర్తింపు ఉంది. ఖోఖో క్రీడ మాదిరిగా ఉండే ఇందులో పోల్స్ ఉండవు. నేలపై తొమ్మిది గళ్లు ఏర్పాటు చేసి ఆటగాళ్లు ఎవరిని తాకకుండా ముందుకు దూసుకుపోవాల్సి ఉంది. తొమ్మిది పాయింట్లు లభిస్తే విజేతగా నిలుస్తారు. ఇందులో ఎవరిని ఎవరు చేతితో తాకినా అవుట్ అవుతారు. ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా ఎవరి చేతికి అందకుండా పూర్తి ఏకాగ్రతతో చురుకుగా ఉండే వాళ్లకే విజయం వరిస్తుంది. జిల్లాలోని నర్సీపట్నానికి చెందిన కోచ్ డి.సీహెచ్.అప్పారావు విద్యార్థులకు ఇందులో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. బాగా ప్రతిభ కనబరుస్తున్న వీరిలో కొందరు ఇప్పుడు జాతీయ పోటీల్లో పాల్గొని అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. గతంలో కర్నూలులోని రాష్ట్ర పోటీల్లో పరాజయం చవిచూసిన వీరు పట్టుదలతో ఇటీవల నెల్లూరులోని సబ్ జూనియర్స్ పోటీల్లో సత్తా చాటారు. బాలికల విభాగానికి ద్వితీయ స్థానం, బాలురకు తృతీయ స్థానం దక్కింది. వీరిలోనూ మంచి ప్రతిభ కనబరిచిన మధు, మధుప్రియ, ఓంప్రియవర్షిణి జాతీయ పోటీల్లో పాల్గొన్నారు.

చాలా ఆనందంగా ఉంది



మాది నర్సీపట్నం మండలంలోని గుర్రందొరపాలెం. నాన్న నూకరాజు తాపీ మేస్త్రి, అమ్మ అమ్మాజీ గృహిణి. చిన్నప్పటి నుంచి కబడ్డీ అంటే ఇష్టం. బడిలో నేర్పిస్తున్న ఆట్యాపాట్యా ఆకట్టుకుంది. కోచ్ ప్రోత్సాహంతో ఇందులో రాణించి జాతీయ పోటీల్లో పాల్గొనగలిగా. ఇదంతా చాలా ఆనందంగా ఉంది. కర్నూలులో జరిగిన రాష్ట్ర పోటీల్లో ఓటమి పాలైనా కుంగిపోలేదు. తరవాత తృతీయ స్థానం సాధించడంతో జాతీయ పోటీల్లో అడుగు పెట్టగలిగా. ఈ పోటీల్లోనూ పతకం సాధించాలన్నది తన లక్ష్యం. క్రీడా కోటాలో వ్యాయామ ఉపాధ్యాయుడిని కావాలన్నది జీవిత ఆశయం

– నంబారు మధు, తొమ్మిదో తరగతి

అందరూ గుర్తిస్తున్నారు...



కొయ్యూరు మండలంలోని మూలపేట మా ఊరు. బడి బస్సులో స్కూలుకు వస్తుంటాను. నాన్న రమణబాబు కారు డ్రైవర్. అమ్మ ప్రభుత్వ ఉపాధ్యాయిని. ఈ క్రీడ గురించి అందరూ తొలుత వ్యంగ్యంగా మాట్లాడారు. ఇప్పుడు జాతీయ పోటీలకు వెళ్లిన నన్ను చూసి ఈ ఆటను అందరూ గుర్తిస్తున్నారు. కోచ్‌కు తోడు వాలీబాల్ క్రీడాకారుడైన నాన్న ప్రోత్సాహంతో ఇందులో రాణిస్తున్నా. నెల్లూరులో జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాను. ఎప్పటికైనా ఇందులో మంచి ప్రతిభ కనబరిచి దాని ద్వారా మంచి ఉద్యోగంతో జీవితంలో స్థిరపడాలన్నది లక్ష్యం.

– కోన మధుప్రియ, ఎనిమిదో తరగతి

ఇప్పుడు ముందుకు వస్తున్నారు..

మాది నర్సీపట్నం మండలంలోని గబ్బాడ. తల్లిదండ్రులు మణికుమారి, సత్తిబాబు వ్యవసాయదారులు. ఈ ఆట గురించి మొదట ఏమీ తెలిసేదికాదు. చరవాణిలో చూసి తెలుసుకున్నాను. స్కూల్‌లోనూ దీనిని నేర్పడంతో ఆటలో చేరాను. బాగా ఆడడంతో కోచ్, ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. పుదుచ్చేరి జాతీయ పోటీల్లో పాల్గొనడం ఎన్నిటికీ మరిచిపోలేను. ఈ స్థాయికి వెళ్లడం చూసి మిగతా విద్యార్థులు సైతం ఇప్పుడు ఇందులో పాల్గొంటున్నారు. మరిన్ని పతకాలు సాధించి ఎప్పటికైనా ఐపీఎస్ కావాలన్నది ఆశయం.



– ఎం. ఓంప్రియ వర్షిణి, పదో తరగతి

నర్సీపట్నంలోనే రాష్ట్రపోటీలకు ప్రతిపాదన

2002 సంవత్సరంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుంచి ఈ ఆటకు గుర్తింపు లభించింది. ఉద్యోగాలు దక్కించుకోవడానికి ఇది దోహదపడుతుంది. ఆట్యాపాట్యా రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో పోటీలు చేపడుతుంటారు. విశాఖ సంఘం పర్యవేక్షణలో ఉమ్మడి విశాఖ జిల్లాల్లో



పాఠశాలల కోచ్‌లు విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. నర్సీపట్నం పిల్లలు ఇప్పుడు ఈ ఆటకు మంచి పేరు తెస్తున్నారు. ఆ ప్రాంతంలోని వారందరిని మరింత ప్రోత్సహించేందుకు నర్సీపట్నంలోనే రాష్ట్ర స్థాయి పోటీలు చేపట్టాలని భావిస్తున్నాం.

– సింహాద్రి గోపీకృష్ణ, ఆట్యాపాట్యా సంఘం ప్రధాన కార్యదర్శి, విశాఖపట్నం

గ్రామాల అభివృద్ధే పల్లె పండగ లక్ష్యం

కశింకోట, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లెపండగ నిర్వహిస్తున్నట్లు ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. పల్లెపండగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కశింకోటలోని అగ్రహారంవీధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కశింకోట పంచాయతీ పరిధిలో రూ. 2.25 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ ఐదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణానికి అంకితభావంతో పనిచేస్తోందన్నారు. మహిళలు సీఎం రమేశ్‌కు హారతులు పట్టారు. అనంతరం కూటమి నాయకులు వారిని ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు హాజరయ్యారు. వెదురుపర్తి, బయ్యవరం, విస్సన్నపేట గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి పీలా గోవింద శంకుస్థాపన చేశారు.


కశింకోటలో ఎంపీ సీఎం రమేశ్ పీలా గోవింద, తాతయ్యనాయుడును సన్మానిస్తున్న నాయకులు

రూ. 214 కోట్లతో 2343 పనులు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: జిల్లాలో పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో ప్రారంభమయ్యాయని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమాలు అన్నీ ఘనంగా జరిగాయన్నారు. జిల్లాలో రూ. 214 కోట్లతో 2343 పనులు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు రూ. 172 కోట్లతో 1697 పనులు, వ్యక్తిగతంగా లబ్ధి చేకూర్చే రూ. 41 కోట్లతో 646 పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు.

శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: శబరిమల వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ 3 ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7 రోజులపాటు ఈ యాత్రలు ఉంటాయన్నారు. 2023 మాదిరిగా ఈ ఏడాది విశాఖ నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామన్నారు. సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్, ఇంద్ర బస్సుల సేవలు అందుబాటులో ఉన్నాయని, పూర్తి వివరాలకు 73829 14219 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

జలాశయాల మరమ్మతుకు రూ.4 కోట్లు

కె.కోటపాడు: రైవాడ, కోనాం జలాశయాల మరమ్మతు, నిర్వహణకు రూ.4 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తెలిపారు. రైవాడకు రూ.3.06 కోట్లు, కోనాంకు రూ.99 లక్షలు కేటాయించామన్నారు.

నేడు కేంద్ర మంత్రి రాక

విశాఖపట్నం: కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధురి మంగళవారం విశాఖ రానున్నారు. ఉదయం 8.20గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు.

సెజ్‌లో అభిజీత్ ఫెర్రో అల్లాయిస్ మూత!

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

అచ్యుతాపురం ఆర్థిక మండలిలోని అతి పెద్ద ఫెర్రో పరిశ్రమ మూతపడింది. జగన్ పాలనలో ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్తు ఛార్జీల బాదుడు, భారీగా కోతలు, ట్రూఅప్ ఛార్జీలు పెంచడం, ఫెర్రో ఉత్పత్తులకు అంతర్జాతీయంగా ధరలు పతనం కావడం వెరసి సెజ్‌లోని అభిజీత్ ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమను సోమవారం మూసివేశారు.

● రోడ్డున పడిన మూడు వేల మంది కార్మికులు
● జగన్ బాదుడుతో కుదేలైన ఫెర్రో రంగం


అభిజీత్ ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ

అభిజీత్ పరిశ్రమ ఎనిమిది కొలిమిలతో రోజుకు 800 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఫెర్రో ఉత్పత్తులు చేసేది. వైకాపా ఐదేళ్ల పాలనలో ఈ పరిశ్రమకు ఎటువంటి రాయితీలు, విద్యుత్తు ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా అప్పటి సర్కారు విద్యుత్తు బాదుడు కారణంగా ఈ పరిశ్రమ తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. ధరలు పెరుగుతాయని, అంతర్జాతీయంగా మార్పు వస్తుందని, వేసవి అనుకూలంగా ఉంటుందని ఎదురు చూసినా ప్రయోజనం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కంపెనీని మూసివేశారు. తెదేపా హయాంలో ఫెర్రో పరిశ్రమలకు యూనిట్‌కు రూ. 4.25 చొప్పున ఉండే విద్యుత్తు ఛార్జీలను జగన్ ప్రభుత్వం ఏకంగా రూ. 6.05కు పెంచింది. అప్పటి నుంచి ఈ పరిశ్రమ తేరుకోలేక పోయింది. అంతర్జాతీయంగా ఫెర్రో ఉత్పత్తుల ధర రూ. 1.55 లక్షల నుంచి ఏకంగా రూ.70 వేలకు పడిపోవడంతో ఏమిచేయాలో తెలియక కంపెనీకి తాళాలు వేశారు. ఫెర్రో మాంగనీస్ టన్ను తయారీకి రూ. 80 వేల నుంచి రూ. 90 వేల మధ్య ఖర్చు అవుతుండగా అంతర్జాతీయంగా దీని ధర రూ. 70 వేల లోపే ఉండడంతో నడపలేక యాజమాన్యం చేతులెత్తేసింది. ఉత్పత్తి ఖర్చులు రాకపోవడం, నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో పరిశ్రమలను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.


కంపెనీ ముందు కార్మికుల ఆందోళన

విద్యుత్తే కీలకం!

ఫెర్రో కంపెనీలకు ప్రధాన వనరు విద్యుత్తే. పరిశ్రమలో కొలిమి ఒక్కసారి ఆపితే మళ్లీ అది ప్రారంభం కావడానికి 48 గంటలకుపైగా సమయం పడుతుంది. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఫెర్రో కంపెనీలకు రాయితీపై విద్యుత్తును సరఫరా చేస్తున్నాయి. జగన్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి రాయితీ ఇవ్వకపోగా, విద్యుత్తు ఛార్జీలు పెంచడం పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. అభిజీత్ ఫెర్రో కంపెనీలో మూడు వేల మంది వరకు కార్మికులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. కంపెనీని అర్ధంతరంగా మూసివేయడంతో వీరంతా రోడ్డున పడ్డారు. కంపెనీ ప్రధాన ద్వారం వద్ద సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ఆందోళనకు దిగారు. కనీసం నోటీసు ఇవ్వకుండా తొలగించారని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, మండల కార్యదర్శి సోమునాయుడు కార్మికుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

సిరులతల్లి తొలేళ్లు.. ఇంటింటా సంబరాలు



హోం మంత్రి అనితకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

భక్తిశ్రద్ధలతో సాగిన ఘటాల పూజలు

నేటి మధ్యాహ్నం సిరిమానోత్సవం



పూజలు చేస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, కుమార్తె అదితి

విజయనగరం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు.. పూసపాటి వంశీయుల ఆడపడుచు.. పైడిమాంబ తొలేళ్ల సంబరం సోమవారం కనుల పండువగా సాగింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 8 గంటల సమయంలో ఆలయ అనువంశిక ధర్మకర్త, గజపతుల వారసుడు పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వచ్చారు. వేదపండితులు రాజేష్, నాగేంద్రశర్మ, శివప్రసాద్, కృష్ణమూర్తి మంత్రోచ్ఛారణల నడుమ కార్యనిర్వహణాధికారి ప్రసాద్, దేవస్థానం ఈవో ప్రసాదరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో తమ ఆడపడుచుకు పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వనంగుడికి వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించి, పూజలు చేశారు. ప్రజలపై అమ్మవారి చల్లని దీవెనలుండాలని అశోక్ ఆకాంక్షించారు.

క్యూలైన్లన్నీ కిటకిట : తొలేళ్ల సందర్భంగా తల్లి దర్శనానికి తెల్లవారుజామున 5 గంటల నుంచే భక్తులు తరలివచ్చారు. మహిళలు ఘటాలను సమర్పించారు. వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అలరించాయి. హోం మంత్రి అనిత, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మేయర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్, పండగ ముఖ్య అధికారి శిరీషారావు, ద్వారకా తిరుమల దేవస్థానం ఈవో మూర్తి తదితరులు దర్శించారు. అర్ధరాత్రి పూజారి బంటుపల్లి వెంకటరావు రైతులకు విత్తనాలు అందజేసి, తొలేళ్ల క్రతువును ముగించారు.

అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలన

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ విజయకృష్ణన్ హెచ్చరించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా 151 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి 99, పంచాయతీరాజ్- 11, ఇతర శాఖలకు చెందినవి 41 ఉన్నాయి. వీటిని శాఖల వారీగా విభజించి సంబంధిత అధికారులకు పంపించారు. కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్వో ఎ.దయానిధి, ప్రత్యేక ఉప కలెక్టర్ సుబ్బలక్ష్మి, గృహనిర్మాణ పీడీ శ్రీనివాస్ అర్జీలు స్వీకరించారు. వీరి సమస్యలు వింటూ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దిష్ట సమయంలో అర్జీలు పరిష్కరించాలన్నారు. అర్జీలను కింది స్థాయి అధికారులకు అప్పగించకుండా స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి పరిష్కరించాలన్నారు.

★ రొంగలివానిపాలెంలో అనధికార క్వారీలు నిలుపుదల చేయాలని పలువురు గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్వారీల్లో పేలుళ్లు భయాందోళన కలిగిస్తున్నాయని, కొత్తగా క్వారీలు ప్రారంభానికి అనుమతులు ఇవ్వవద్దని కోరారు.

★ అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో తెలుగు సబ్జెక్టును పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుతోనే కళాశాలలు మార్చడం దుర్మార్గమన్నారు. విద్యార్థులకు మాతృభాషను దూరం చేయడం తగదన్నారు. తక్షణమే తెలుగు సబ్జెక్టును పునరుద్ధరించాలని, లేని పక్షంలో విద్యార్థులతో ఆందోళన చేస్తామన్నారు.



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది



★ భర్త రొంగలి వెంకటరమణ 2009లో అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి వితంతు పింఛను మంజూరు చేయాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నాను. పలుమార్లు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదని రొంగలివానిపాలెనికి చెందిన రొంగలి దేముడమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

సాధారణ కుటుంబం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా..



కోటవురట్ల, న్యూస్‌టుడే: మట్టిలో మాణిక్యాలు ఉంటాయని పెద్దలంటారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి కోటవురట్ల మండలం రామచంద్రపాలెనికి చెందిన తమరాన రమేష్‌బాబు ఎంపికయ్యారు. ఈయన తల్లిదండ్రులు రామ్మూర్తి, సత్యవతి. వ్యవసాయ కూలీలు. ఒకటి నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదివారు. డి.యర్రవరంలో బీఈడీ, భీమవరంలో ఎంఈడీ చదివారు. పుదుచ్చేరి కేంద్రీయ విశ్వ విద్యాలయంలో అనువర్తిత మనో విజ్ఞాన శాస్త్రంలో ఎంఎస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. సెప్టెంబర్ 30న కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో (సీయూకే) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం మేరకు ఇదే విశ్వవిద్యాలయం మానసిక శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీలేదని రమేష్‌బాబు రుజువు చేశారని గ్రామస్థులు ఆయనను అభినందించారు.

ఖాదరీబాబా ఉరుసు ఆరంభం

కశింకోట, న్యూస్‌టుడే: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన అబ్దుల్ అజీజ్ షా ఖాదరీబాబా 77వ ఉరుసు సోమవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవానికి జిల్లా నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి హిందూ, ముస్లింలు ఖాదరీబాబా సమాధిని దర్శించి ప్రార్థనలు చేశారు. తొలి రోజు గ్యారీషరీఫ్‌తో ఉరుసు ప్రారంభమైంది. ఉదయం 6 గంటల నుంచి ఆరాధన కార్యక్రమాలు ఆరంభమయ్యాయి.



ఖాదరీబాబా సమాధిని దర్శించుకున్న భక్తులు

సున్నం తక్కువైతే మెత్తగా.. ఎక్కువైతే నల్లగా..

అనకాపల్లి, న్యూస్‌టుడే: చెరకు రైతులు బెల్లం తయారీకి శ్రీకారం చుడుతున్నారు. నాణ్యమైన బెల్లం తయారీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అనకాపల్లి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీకే జగన్నాథరావు సూచిస్తున్నారు. బాగా పక్వానికి వచ్చిన చెరకు నుంచే బెల్లం తయారీ చేయాలి. స్వల్పకాలిక రకాలు 10 నెలలు, మధ్య దీర్ఘకాలిక రకాలు 11 నెలలకు పక్వానికొస్తాయి. చెరకు మొదళ్లలో చక్కెర పాళ్లు ఎక్కువగా ఉంటాయి. చెరకును దుబ్బు మొదలు వరకు నరకాలి. లేకపోతే రస నాణ్యత ఆరు శాతం వరకు తగ్గిపోతుంది. చెరకు నరికిన వెంటనే గానుగాడాలి. ఆలస్యమైతే దిగుబడి, రస నాణ్యత తగ్గుతుంది.

★ తగినంత రవ్వకట్టు, లేత బంగారు రంగు ఉండి పంచదార శాతం 80 కంటే ఎక్కువగా ఉండాలి. బెల్లంలో తేమ శాతం ఆరు కంటే తక్కువగా ఉండాలి. రసాన్ని శుభ్రపరిచేందుకు, మలినాలను తొలగించేందుకు తగినంత సున్నం కలపాలి. సున్నం తక్కువ వేస్తే బెల్లం మెత్తగా.. ఎక్కువైతే నల్లగా మారుతుంది. సాధారణంగా 300 కేజీల చెరకు రసానికి 110 నుంచి 225 గ్రాముల తడి సున్నపు ముద్ద కలపాలి. పక్వ దశకు ముందు,



బాగా ఆలస్యమైన తోటల నుంచి బెల్లం తయారు చేసే సమయంలో ఆఖరిలో మూడు నుంచి ఐదు కేజీల పంచదార కలుపుకోవాలి. తద్వారా పంచదార బరువుకు సమానంగా బెల్లం అధికంగా వస్తుంది. బెల్లం నాణ్యత బాగుంటుంది.

★ రంగు రావడానికి సోడియం హైడ్రోజన్ సల్ఫేట్‌ను ఎక్కువగా వాడొద్దు. క్వింటాల్ బెల్లంలో సల్ఫర్ డయాక్సైడ్ ఏడు గ్రాముల కంటే ఎక్కువ వాడకూడదు. రైతులు 40 నుంచి 50 గ్రాముల వరకు వాడుతున్నారు. దీని బదులు సున్నపు సుక్రోజ్/ మునగాకు రసం వాడాలి. పాకం పొంగి పొర్లుతున్నట్లు అనిపిస్తే సున్నం నూనె చిలకరించాలి. పెనాన్ని దించబోయే ముందు మంటను బాగా తగ్గించి చిక్కబడిన రసం అడుగంటకుండా తెడ్డుతో బాగా కలపాలి.

పాయకరావుపేట, న్యూస్‌టుడే

వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే మార్కెట్‌లో డిమాండు ఉన్న పంటలను ఎంచుకోవాలి. మిగతా రైతులకు భిన్నంగా ముందడుగు వేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామానికి చెందిన రైతు వెన్నా శ్రీను. విరుల సాగుపై మక్కువతో బంతిని ఎంచుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

బంతి సాగు.. లాభాలు బాగు

సత్ఫలితాలు సాధిస్తున్న రైతు



చిన్నతనం నుంచి ఆయనకు వ్యవసాయంపై మక్కువ. పెట్టుబడి అధికంగా ఉన్నా.. ఆ స్థాయిలో ఆదాయం గడించవచ్చని గుర్తించారు. ఈ ప్రాంతంలో పువ్వుల సాగు చేపట్టే రైతులు తక్కువ. కడియపులంక నుంచి తుని, పాయకరావుపేట తదితర ప్రాంతాలకు పూలను తీసుకువస్తుంటారు. కొత్తూరులో భూమిని కౌలుకు తీసుకుని ఐదేళ్లుగా పూలసాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎకరా విస్తీర్ణంలో బంతి సాగుకు బెంగళూరు నుంచి మొక్కలు తీసుకువచ్చారు. ఒక్కో మొక్క రూ.3కి కొనుగోలు చేశారు. ఎకరాకు పది వేల మొక్కలు నాటారు. ఆరంభంలో మొక్కలను జలగలు ఆశించి తినేయడంతో ఇబ్బందులు వచ్చాయి. వెనకడుగు వేయకుండా మరోసారి మొక్క నాటారు. సేంద్రియ విధానాలతో జలగల బెడద వదిలించారు. మొక్క ఏపుగా ఎదిగేందుకు ఎరువులతోపాటు పశువుల గెత్తం వాడారు. రూ.లక్ష పెట్టుబడి కాగా.. పూల దిగుబడులను మార్కెట్‌కు తరలిస్తున్నారు. కేజీ రూ.50 నుంచి రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు.

దిగుబడి ఆశాజనకం..: ఎకరాకు మూడు టన్నులకుపైగా దిగుబడి వచ్చే ఆస్కారముంది. సంక్రాంతి వరకు డిమాండ్ ఉంటుంది. చామంతి, మల్లె సాగు చేపట్టనున్నా. పూల కోసం వ్యాపారులు తోట వద్దకు వస్తున్నారు. తద్వారా మార్కెటింగ్‌కు ఇబ్బందులు ఉండటం లేదు. ఒక సీజన్ కలిసి రాకపోయినా మరో సీజనులో లాభాలు వస్తున్నాయి.

– శ్రీను, రైతు



రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

వరి దిగుబడులపై పొడ తెగులు ప్రభావం

? నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. పొట్ట దశలో వరి దుబ్బులపై మచ్చలు ఏర్పడుతున్నాయి. కొన్నిచోట్ల మొక్కలు ఎండిపోతున్నాయి.

– అప్పారావు, బయలు కించంగి

✔ పంట దుబ్బు చేసే సమయం, పొట్ట వచ్చే సమయంలో రైజోక్టోనియా సొలానీ శిలీంద్రం ఆశిస్తుంది. దీన్ని పొడ తెగులు అంటారు. ఈ తెగులు వల్ల పంట దిగుబడులు తగ్గిపోతాయి. తాలు గింజలు ఏర్పడతాయి. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండటం, మబ్బులతో కూడిన వర్షం వల్ల ఈ తెగులు సోకుతుంది. నివారణకు పొలంలో నీటిని తగ్గించాలి. మోతాదుకు మించి నత్రజని (యూరియా) వాడకూడదు. ప్రకృతి వ్యవసాయంలో అయితే ఆవు పేడ, మూత్రం, ఇంగువతో తయారు చేసిన కషాయం వినియోగించడం ద్వారా తెగులు ప్రభావాన్ని నియంత్రించవచ్చు.

? మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఏం చేయాలి. – రాంగోపాల్, ముల్లుమెట్ట

✔ మొక్కజొన్న విత్తిన 30 - 40 రోజుల తర్వాత ఎమామెక్టిన్ బెంజోయేట్ మందు 5 శాతం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సేద్యపు విభాగం శాస్త్రవేత్త **సందీప్‌నాయక్** సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

రంగు, మధ్య రకం బెల్లం ధర తగ్గుముఖం

రైతేరాజు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా రంగు, మధ్య రకం బెల్లం ధరలు భారీగా తగ్గాయి. నాసి రకం ధరలు పెరిగాయి. రంగులు వంద కేజీలకు రూ.320, మధ్య రకాలు రూ.315 తగ్గాయి. నాసి రకం రూ.140 పెరిగాయి.

రకం	గత వారం	ఈ వారం
రంగులు	4,960	4,640
మధ్య	4,220	3,905
నాసి	3,235	3,375



సాగులో సందేహాలా ఫోను చేయండి

అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ **సీహెచ్ ముకుందరావు** సమాధానాలు ఇస్తారు. మంగళవారం ఉ: 9 నుంచి - సాయంత్రం 5 గంటల మధ్య **99081 50600** నంబరుకు ఫోన్ చేయవచ్చు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలపై ఆరా



మునగపాకలో యాప్‌లను పరిశీలిస్తున్న జైత్రి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలపై కేంద్రం బృందం పరిశీలన చేసింది. అచ్యుతాపురం, దుప్పితూరు గ్రామాల్లో డాక్టర్ జైత్రి నాయకత్వంలో ఈ బృందం సోమవారం పర్యటించింది. రక్తపోటు, క్యాన్సర్, మధుమేహంను ప్రాథమిక దశలోనే ఏ విధంగా గుర్తిస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. వైద్యసేవలు పొందుతున్న వారితో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. వైద్యులు జయప్రశాంతి, కె.శ్రావ్య, సీహెచ్ఓ వేణుగోపాలరావు, రమణబాబు, సన్యాసిరావు, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: చూచుకొండ ఆరోగ్య కేంద్రాన్ని, గణపర్తి ఉప కేంద్రాన్ని సోమవారం వైద్యశాఖ కేంద్ర బృందం సందర్శించింది. కేంద్ర బృంద సభ్యులు జైత్రి, ప్రశాంతి తదితరులు ఆరా తీశారు. వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మందుల కొరతపై ఆరా తీశారు. వైద్యాధికారిణి ఎస్తేర్‌రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖకు బదలాయించండి

హెల్త్ సెక్రటరీల ధర్నా

కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలను పూర్తిస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖలోకి తీసుకురావాలని కలెక్టరేట్ వద్ద ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆళ్ల దేవకి మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, డీఎంహెచ్ఓల పరిధిలో పనిచేయడం వల్ల వీరికి ఒకే సమయంలో వేరువేరు పనుల అప్పగింతతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మూడేళ్లుగా సమస్య పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోలేదన్నారు. పూర్తిస్థాయిలో వైద్య, ఆరోగ్య శాఖకు బదలాయించాలని, సీనియార్టీ జాబితా తయారు చేసి పదోన్నతులు కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్, డీఎంహెచ్ఓలకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రత్నం పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలు

కాఫీ ధరలు పెంచుతూ అపెక్స్ కమిటీ నిర్ణయం

విశాఖపట్నం, న్యూస్‌టుడే : అంతర్జాతీయంగా కాఫీ ధరల్లో వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకొని కొన్ని రకాల కాఫీ ధరలను పెంచుతూ బీచ్‌రోడ్డులోని గిరిజన సహకార సంస్థ (జి.సి.సి) ప్రధాన కార్యాలయంలో జరిగిన అపెక్స్ కమిటీ సోమవారం నిర్ణయం తీసుకుంది. ట్రైబుల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అరబికా పార్చ్‌మెంట్ కేజీ రూ.285, అరబికా చెర్రీ రకానికి చెందిన కాఫీ కేజీ రూ.150, రొబస్టా రకానికి చెందిన కాఫీ కేజీ రూ.80గా ధరలు నిర్ణయించామన్నారు. ఈ మేరకు రైతులకు చెల్లిస్తామన్నారు. గతంతో పోల్చితే పార్చ్‌మెంట్, చెర్రీల కాఫీ ధరలు కేజీపై రూ.5, రొబస్టాపై రూ.10 పెరిగాయని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి తెలిపారు. గత ఏడాది 565 మెట్రిక్ టన్నుల కాఫీని గిరిజన రైతుల నుంచి సేకరించగా ఈ సంవత్సరం 2000 మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. సమావేశంలో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్, కాఫీ బోర్డ్ ఆఫ్ ఇండియా బెంగళూరు డైరెక్టర్ డి.ఆర్.బాబురెడ్డి, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఎస్.భార్గవి, తదితరులు పాల్గొన్నారు.



అపెక్స్ కమిటీలో జీసీసీ ఎండీ కల్పనాకుమారి, ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే మత్స్యలింగం

16న జడ్పీ స్థాయీ కమిటీ సమావేశాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ (జడ్పీ) స్థాయీ కమిటీ సమావేశాలు ఈనెల 16న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన 1 నుంచి 7 వరకు కమిటీల సమావేశాలు జరుగుతాయన్నారు. సభ్యులు, అధికారులు ఉదయం 10గంటల కల్లా చేరుకోవాలని కోరారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గురుకుల విధానంలో శిక్షణ ఇవ్వడానికి సంస్థల నుంచి ఈనెల 21లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి కె.రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సాంఘిక, గిరిజన సంక్షేమశాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా 50 : 50 విధానంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించాయన్నారు. దరఖాస్తు చేసుకునే సంస్థలు కనీసం రెండేళ్లపాటు డీఎస్సీ శిక్షణ ఇచ్చి ఉండాలన్నారు. గత డీఎస్సీలో కనీసం వంద మంది ఉద్యోగాలు పొందిన వారిపై, మూడేళ్ల సరాసరి టర్నోవర్ రూ. 40 లక్షలు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న సంస్థల మరిన్ని వివరాలకు ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈనెల 16 నుంచి మూగజీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 3.42 లక్షలు ఉన్న జీవాలకు నట్టల నివారణకు ప్రభుత్వం రూ.8 లక్షలు మంజూరు చేసిందన్నారు. అన్ని మండలాలకు మందులు సరఫరా చేస్తామన్నారు.

భవానీలకు త్రుటిలో తప్పిన పెనుముప్పు

నల్లజర్ల, న్యూస్‌టుడే : తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని అనంతపల్లి శివారులో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ప్రైవేటు టావెల్ బస్సు విభాగినిని ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 27 మంది భవానీ మాలధారులు సురక్షితంగా బయటపడ్డారు. అనకాపల్లి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న హైవే పోలీసులు వారందరిని వేరే బస్సులో విజయవాడకు పంపించారు.



నుజ్జయిన బస్సు ముందు భాగం



సురక్షితంగా బయటపడిన భవానీలు

బస్సు ఢీకొని ఆర్‌ఆర్‌పేట వాసి మృతి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: గుల్లిపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చోడవరం మండలం రాయపురాజుపేటకు చెందిన పసుపులేటి ఈశ్వరరావు (45) మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై కె.కోటపాడు మండలం గొండుపాలెం వస్తుండగా మందుల కంపెనీకి చెందిన బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఈశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడని ఎస్సై ధనుంజయ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దొండవాక తీరంలో నమూనాల సేకరణ

నక్కపల్లి, న్యూస్‌టుడే: దొండవాక తీరంలో చేపల మృత్యువాతపై అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. దొండవాక, రాజయ్యపేట తీరాల్లో మృత్యువాత పడిన చేపలను డీఎఫ్ఓ ప్రసాద్, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ ముకుందరావు, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్, డ్రగ్ విభాగం తదితర అధికారులు పరిశీలించారు. ఉప్పుటేరులో నీటి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ చేపల మృత్యువాతకు కారణాలను తెలుసుకోడానికి నమూనాలు తీసుకున్నట్లు చెప్పారు. పరీక్షల నివేదిక వస్తే కారణాలేంటనేది తెలుస్తాయన్నారు.



చేపలు, నీటి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

కోటవురట్ల, న్యూస్‌టుడే : పందూరులో కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించారని ఈ గ్రామ సర్పంచి జగదీష్, భాస్కరావు, అప్పలకొండ తహసీల్దార్ తిరుమలబాబుకు సోమవారం ఫిర్యాదు చేశారు. కోటనందూరుకు ఒకరు తప్పుడు సర్వే నంబర్లను సృష్టించి అనుభవిస్తున్నారని, దీనిపై ఫిర్యాదు చేయగా, ఆ నాటి ఆర్డీఓ సూర్యారావు దీనిని రద్దు చేశారన్నారు. అదే భూమిని కారం పొడి తయారీ పరిశ్రమకు ఇచ్చారన్నారు. అయితే ఇప్పటి వరకు ఆ భూమిలో ఎటువంటి కట్టడాలు జరగలేదని, ఆ భూమిని స్వాధీనం చేసుకొని, గ్రామానికి చెందిన పేదలకు ఇప్పించాలని కోరారు. దీనిపై విచారణ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా : **దేవర**, రామచంద్ర: **మార్టిన్**, శ్రీ సత్య: **మా నాన్న**, సత్యనారాయణ స్క్రీన్1: **విశ్వం**, స్క్రీన్2: **శ్వేగ్** వెంకటేశ్వర: **జిగ్రా**, పర్తిసాయి: **వేట్టయన్ ద హంటర్**, షిర్డిసాయి: **వేట్టయన్ ద హంటర్** **అచ్యుతాపురం:** శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **వేట్టయన్, విశ్వం** స్క్రీన్-2: **దేవర**

ఉపాధ్యాయిని సరెండర్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి జడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని రాధారాణిని విశాఖ డీఈవో కార్యాలయానికి సరెండర్ చేస్తూ సరెండర్ చేస్తూ విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారని అనకాపల్లి డీఈఓ వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఈమె సకాలంలో పాఠశాలకు రావడం లేదని, వచ్చినా పాఠాలు బోధించడం లేదని ఇటీవల విద్యార్థినులు ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే!

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

వ్యర్థాలతో నీటి ప్రవాహానికి అడ్డంకులు


నామవరం కొండ గెడ్డ

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కొండ గెడ్డ కాలువలో పూడిక పెరిగిపోయింది. ఈ కాలువ వ్యర్థాలతో రూపు మారిపోయింది. సాగు నీటి సరఫరాకు అటంకాలు ఏర్పడుతున్నాయి. దీని ద్వారా నామవరం, గుంటపల్లి, మంగవరం గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుంది. పూడిక కారణంగా వరదనీరు పోయేందుకు మార్గం లేక నామవరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆస్తులున్నా తప్పని తిప్పలు


డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయం

అనకాపల్లి, న్యూస్‌టుడే

ఒకనాడు రైతులకు అండగా నిలిచిన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయింది. కోట్ల రూపాయిల విలువైన ఆస్తులున్నా పాలకులు నిర్లక్ష్యం కారణంగా వ్యాపారం లేక వెలవెలబోతుంది. వైకాపా హయాంలో రెండు పాలకవర్గాలూ ఒక్క పని చేయలేకపోయాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డీసీఎంఎస్‌పై దృష్టి పెట్టింది. బిజినెస్ మేనేజర్‌గా సత్యకుమార్, పర్సన్ ఇన్‌ఛార్జిగా సబ్ కలెక్టర్ అశోక్‌లను నియమించారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధరలు అందించాలనే ఉద్దేశంతో 1985లో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం డీసీఎంఎస్‌లను ఏర్పాటు చేసింది. ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులను తక్కువ లాభాలతో అమ్మకాలు చేపట్టేవారు. జిల్లాలో రైతులు తాము పండించే ధాన్యం, బెల్లం, నువ్వులు వంటి ఉత్పత్తులను సంస్థ ద్వారా అమ్మకాలు చేయడానికే ఆసక్తి చూపేవారు. వరి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, పుస్తకాలు, వస్త్రాలు, మందుగుండు సామగ్రి వంటివి అమ్మకాలు చేసేవారు. వీటిని కొనుగోలు చేయడానికి జనం మొగ్గు చూపేవారు. దీంతో నిత్యం సంస్థ కార్యాలయం జనంతో కళకళలాడేది. ప్రస్తుతం వ్యాపారం లేక వెలవెలబోతోంది.


వాణిజ్య సముదాయం నిర్మించే స్థలం ఇదే!

విలువైన స్థలాలు ఉన్నా..

పట్టణం నడిబొడ్డున రెండు స్థలాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న కార్యాలయం స్థలం 1.90 ఎకరాలు. బండిగాడి వీధిలో 96 సెంట్ల స్థలం ఉంది. విలువైన స్థలాలు వృథాగా ఉన్నాయి. ప్రధాన కార్యాలయం ఆవరణలో పెట్రోలు బంకు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన స్థలంలో వాణిజ్య సముదాయం, ప్రభుత్వ కార్యాలయాలకు అనువుగా నిర్మాణాలు చేయాలని భావిస్తున్నారు. బండిగాడి వీధిలో 96 సెంట్ల స్థలం ఉంది. ఇక్కడ దుకాణాల సముదాయం నిర్మించాలని 1995లోనే శంకుస్థాపన చేసినా నిర్మాణం చేపట్టలేదు. ఇక్కడ 36 దుకాణాలు, మూడు గోదాములు నిర్మించాలని గతంలోనే నిర్ణయించారు. ఈ మేరకు రూ. 1.33 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. దీనిపై బిజినెస్ మేనేజర్ సత్యకుమార్‌ను వివరణ కోరగా ముందుగా పెట్రోలు బంకు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు అవసరమైన అనుమతులు వచ్చాయన్నారు. బంకు నిర్వహణపై కంపెనీతో చర్చిస్తున్నామని తెలిపారు.

జోనల్ కార్యాలయంలో అధికారులేరి?



అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ముఖ్యఅధికారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేసిన జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు ఈనెల 4న బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. కనీసం ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించలేదు. దీనివల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే కీలకమైన రెవెన్యూ, ఆరోగ్య విభాగం అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అనకాపల్లిలో 27 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇటీవల వీటిలో పనిచేస్తున్న 8 మందిని ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇక్కడ నుంచి బదిలీ అయిన వారికి జోనల్ కమిషనర్ లేక రిలీవ్ ఆర్డర్ ఇవ్వడం లేదు. ఫలితంగా వీరంతా గాలిలో ఉన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ముందస్తు చర్యల్లో భాగంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి. ముఖ్యమైన జోనల్ కార్యాలయంలో దాని గురించి పట్టించుకున్న నాథుడే కనిపించలేదు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలు నిర్వహించాల్సి ఉంది. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి సూపరింటెండెంట్ వెళ్లారు. ఉదయం 11 అయినా ఇతర అధికారులు ఎవరూ రాలేదు. ప్రణాళికా విభాగం అధికారి 11 గంటలకు వచ్చినా తన శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను చేపట్టలేదు. ఇప్పటికైనా జోనల్ కమిషనర్‌ను నియమించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విశాఖ డెయిరీ భూ అక్రమాలపై విచారణకు డిమాండ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ సంస్థ చినగదిలి మండల పరిధి సర్వే సంఖ్య 13, 21, 26ల్లో భూ అక్రమాలకు పాల్పడిందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఇదే విషయమై జీవీఎంసీ కమిషనర్, పోలీసు కమిషనర్‌కు సైతం ఫిర్యాదులు అందజేసినట్లు మూర్తి యాదవ్ మీడియాకు తెలిపారు. 1987 నాటి సహకార చట్టం ప్రకారం పాడిపరిశ్రమ అభివృద్ధికి అప్పటి ప్రభుత్వం విశాఖ డెయిరీకి 20 ఎకరాల భూమి కేటాయించిందన్నారు. అయితే 2006లో డెయిరీ కంపెనీ చట్టం పరిధిలోకి వెళ్లిందన్నారు. తద్వారా డెయిరీకి సహకార చట్టం వర్తించదన్నారు. మొత్తం భూమిలో 12.05 ఎకరాలను హెల్త్‌సిటీ కోసం గతంలో కేటాయించారని, మిగిలిన 7.95 ఎకరాల్లో డెయిరీ సంస్థ వివిధ నిర్మాణాలు చేపట్టిందన్నారు. ఈభూమి విలువ రూ. 500కోట్ల వరకు ఉంటుందని, దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు.


విశాఖలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న మూర్తియాదవ్

అ వీ ఇ వీ

హెడ్‌కుక్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రాంబిల్లి, న్యూస్‌టుడే: కస్తూర్బా విద్యాలయంలో హెడ్‌కుక్ నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ ఎం.సూర్యారావు ఒక ప్రకటనలో కోరారు. వయస్సు 18 నుంచి 42 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 15 సాయంత్రం అయిదు గంటలలోపు తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: వృత్తి విద్యాకోర్సుల్లో భాగంగా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ నిర్వహించామని పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.జాన్‌ప్రసాద్ తెలిపారు. దీనివల్ల నైపుణ్యాలపై పట్టు సాధించవచ్చని చెప్పారు.

నాలుగు ఫిర్యాదులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లిలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దారు నరసింహమూర్తి తెలిపారు. ఇవన్నీ భూములకు సంబంధించిన వివిధ సమస్యలేనని అన్నారు.

తపాలా బీమా పథకాలపై కళాజాత

రాంబిల్లి, న్యూస్‌టుడే: రాంబిల్లిలో తపాలా శాఖ పథకాలపై సోమవారం కళాజాత నిర్వహించారు. కళాకారులు పాటల ద్వారా పథకాలపై అవగాహన కల్పించారు. సుమారు తొమ్మిది పథకాల వరకు అమల్లో ఉన్నాయన్నారు. అధికారి కన్నయ్యనాయుడు, బీపీఎం డి.జగన్నాథరాజు పాల్గొన్నారు.

యూరియా ఉన్నా సరఫరా చేయారా?

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో ఉన్నా విక్రయించక పోవడంపట్ల రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

ఇస్లాంపేటలో పతాకావిష్కరణ

కొత్తూరు(అనకాపల్లి): శారదానగర్ ఇస్లాంపేటలో మదీనా మసీదు ఆధ్వర్యాన సోమవారం గార్మీ షరీఫ్ కార్యక్రమం జరిగింది. ఇస్లాంపేట కూడలిలో నిర్వహించిన పతాకావిష్కరణలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.


పాల్గొన్న ముస్లిం ప్రతినిధులు

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: రైతులకు పథకాలు, ప్రోత్సాహాలను ప్రభుత్వం వెంటనే అందజేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అనకాపల్లి సీపీఎం భవనంలో సోమవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, ప్రతినిధులు నాయనబాబు, శివ, నాయుడు, రంగారావు, దేముళ్లు, తాతారావు పాల్గొన్నారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు


తిమ్మరాజుపేటలో కోలాహలం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అనకాపల్లి గవరపాలెంలో ఏర్పాటు చేసిన 30 అడుగులదుర్గాదేవి అమ్మవారి మట్టి ప్రతిమను మండపం వద్దనే నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శివశక్తి ఫ్రెండ్స్ అధ్యక్షులు పీలా రాముడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం, మునగపాక, న్యూస్‌టుడే: తిమ్మరాజుపేటలో దుర్గాదేవి ప్రతిమను సోమవారం ఆవకాలువలో నిమజ్జనం చేశారు. మూడు కిలోమీటర్ల మేర ఈ ఊరేగింపు నిర్వహించారు. ఘటాలతో భవానీ భక్తులు నృత్యాలు చేశారు. సర్పంచి శరగడం భాగ్యలక్ష్మి, ఉపసర్పంచి భీశెట్టిరాము, కర్రి శ్రీనివాసరావు, కర్రి నాయుడు, శరగడం శివబాపునాయుడు, మళ్ల రాము, శరగడం జోగినాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. మునగపాక లింగరాయి దేవస్థానంలో నెలకొల్పిన దుర్గాదేవి అనుపోత్సవంలో మహిళలు ఘటాలతో ఊరేగించారు. మునగపాకలో నవంబరు 11న సాంబమూర్తి దేవుని శూలాల ఉత్సవానికి ఈ నెల 16న రాట మహోత్సవం చేయనున్నట్టు ఉత్సవ కమిటీ ఛైర్మన్ బూడిద శ్రీనివాసరావు తెలిపారు.


అనకాపల్లిలో మండపం వద్ద నిమజ్జనం

పంచాయతీలకు సొంత భవనాలు


ఏటికొప్పాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి/ గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో 17 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు నిర్మిస్తానని, రోడ్లు అవసరం ఉన్న చోట్ల సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపడతానని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఏటికొప్పాకలో సోమవారం ఆయన పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ. 17 లక్షల వ్యయంతో ఏటికొప్పాకలో సిమెంట్ రోడ్డు పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలో రోడ్లు లేని చోట్ల కొత్తగా రోడ్లు నిర్మించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ. 25 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఇంత భారీగా నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 54 గ్రామాల్లో 80 పనులకు శంకుస్థాపనలు చేస్తామన్నారు. అన్ని గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నాయకులు అన్నం బాబ్జీ, సేనా నాని, భజంత్రీల లక్ష్మి, ఇత్తంశెట్టి రాజు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, లవుడు లోవరాజు తదితరులు పాల్గొన్నారు. బయ్యవరం, పద్మనాభరాజుపేట, పులపర్తి, కృష్ణాపురం, పోతిరెడ్డిపాలెం, ములకలాపల్లి తదితర గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు, అన్నం బాబ్జీ, ఎంపీడీవో కొండలరావు పాల్గొన్నారు.

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: దశలవారీగా గ్రామాలన్నీ అభివృద్ధే లక్ష్యమని రాష్ట్ర పట్టణ, ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. రామాపురం, దేవీనగర్, సత్యనారాయణపురం, మూలపేట, పిసినికాడ సాయినగర్‌ల్లో పనులకు శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. సర్పంచులు సప్పారపు లక్ష్మీ ప్రసన్న, పలకా ధనలక్ష్మి నాయకులు పూసపాటి భరత్‌బాబు, చదరం నాగేశ్వరరావు, మేడిశెట్టి రాధ, కర్రి బాబీ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట గ్రామీణం, కోటవురట్ల, న్యూస్‌టుడే: మంగవరం, నామవరం, సీతారాంపురం గ్రామాల్లో పనులకు అధికారులు, కూటమి నాయకులు శంకుస్థాపనలు చేశారు. ఎంపీడీవో జయప్రకాశరావు, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ వై.సత్యనారాయణ, ఏపీవో హేమలత, నాయకులు వెంకటకృష్ణ, కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, గోవింద్, రామారావు తదితరులు పాల్గొన్నారు. కోటవురట్ల, కైలాసపట్నం, తంగేడుల్లో సీసీ రోడ్ల పనులకు తెదేపా మండల కమిటీ అధ్యక్షులు జానకీ శ్రీను, ఎంపీడీఓ కాశీ విశ్వనాథరావు శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ తిరుమలబాబు, ఏపీఓ నాగరాజు, సర్పంచి అనిల్‌కుమార్, ఎంపీటీసీ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరులో పాల్గొన్న పీలా, బుద్ధ తదితరులు


కోటవురట్లలో కూటమి నాయకులు, అధికారులు

తొలిరోజు అంతంతమాత్రంగానే విద్యార్థులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: దసరా సెలవుల తర్వాత పాఠశాలలు తెరుచుకున్నా విద్యార్థులు అంతంత మాత్రంగానే వచ్చారు. మండలంలోని 73 పాఠశాలల పరిధిలో ఎనిమిది వేల మందికి పైగా విద్యార్థులు న్నారు. దసరా సెలవులు ముగిసి సోమవారం బడులు తెరుచుకోగా సగం మంది మాత్రమే వచ్చారు.


ఉన్నత పాఠశాలలో ఓ తరగతి గదిలో ఇలా

విశ్వవిద్యాలయాలకు పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించండి

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విశ్వవిద్యాలయాలకు పొట్టిశ్రీరాములు పేరు కొనసాగించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. అనకాపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సోమవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం అంగీకారం లేకుండా తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో సభ్యుల నిరసన

గోతులు పూడ్చాలని ఆందోళన

రాంబిల్లి, న్యూస్‌టుడే: రాంబిల్లి ప్రధాన రహదారిపై గోతులు పూడ్చాలని సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల కన్వీనరు జి.దేముడునాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేపట్టారు. భారీ వాహనాలతో రహదారి గుంతలుగా మారిందన్నారు. గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వై.రాము, ఆర్.రాంబాబు పాల్గొన్నారు.


రోడ్డు బాగు చేయాలని నాయకుల ఆందోళన

పంటలు తరలించాలంటే అవస్థే!

దర్పణం


ఉప్పుటేరు రహదారి దుస్థితి

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెంటకోట వద్ద ఉప్పుటేరు నది అవతల పంట భూముల నుంచి పండించిన ఉత్పత్తులు తరలించాలంటే రైతుల అవస్థలు వర్ణనాతీతం. ఈ ప్రాంతానికి చెందిన అధిక మంది రైతులకు నదికి అవతల మాసాహెబ్‌పేట రెవెన్యూ పరిధిలో సాగు భూములు ఉన్నాయి. దీంతో నది దాటుకుని నిత్యం రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. నదిలోకి వరదనీరు చేరితే రాకపోకలు నిలిచిపోతున్నాయని, ఉత్పత్తులు తరలించేందుకు దారి లేకుండా పోతుందని చెబుతున్నారు. నదిపై వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ఉత్సవ్‌లో వైష్ణవి ప్రతిభ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ప్రేరణ్ ఉత్సవ్‌కు ఎంపికై గుజరాత్ వెళ్లి వచ్చిన విద్యార్థిని డి.వైష్ణవిని సోమవారం ఎలమంచిలి బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈనెల 6 నుంచి 12 వరకూ గుజరాత్‌లో వికసిత్ భారత్- 2047 లక్ష్యంగా వీరికి అవగాహన కల్పించారు. జీవితాన్ని మలుపు తిప్పే ఎన్నో విద్యలను నేర్పించారు. అవన్నీ నేర్చుకుని వచ్చిన విద్యార్థిని పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సత్కరించారు. ఈమె గార్డెన్ ఉపాధ్యాయినిగా ఎ.సునీత వ్యవహరించారు. అనకాపల్లి జిల్లా నుంచి ఎలమంచిలి బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న వైష్ణవి, నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పి.హర్షవర్దన్ రాష్ట్ర స్థాయికి ఎన్నికయ్యారని సునీత చెప్పారు.


వైష్ణవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: అనకాపల్లిలో బర్మాకాలనీలో వీధిలైట్లు వెలగడం లేదు. రాత్రివేళల్లో అంధకారం అలముకుంటోంది. – **రాంబాబు, అనకాపల్లి**

✓: వీధిలైట్ల మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – **నానాజీ, ఏఈ, అనకాపల్లి**


నక్కపల్లి, న్యూస్‌టుడే

?: నక్కపల్లి వీవర్సు కాలనీ వద్ద తాగునీటి పైపు లైను లీకవుతుంది. నీరు వృథాగాపోతోంది, దీన్ని అరికట్టాలి. – **అప్పారావు**

✓: తక్షణమే మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికడతా. – **రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి**

సాగునీటి సంఘాల్లో సందడి

నక్కపల్లి, ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఒక సంఘంలో అధ్యక్షుడు, ఆరుగురు సభ్యులు ఉంటారు. గడిచిన అయిదేళ్లలో ఈ సంఘాలకు ఎన్నికలు జరగలేదు. ఫలితంగా అడిగేవారు లేక సాగునీటి వనరుల నిర్వహణ నిర్లక్ష్యం బారిన పడింది. ఫలితంగా చాలా చోట్ల చెరువులు, కాలువలు అభివృద్ధికి నోచుకోలేదు. వచ్చే నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేసి, సంఘాలకు పగ్గాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నక్కపల్లి మండలంలో చీడిక మినీ జలాశయం ఉండగా, మిగిలినవన్నీ జలవనరులశాఖ పరిధిలోని చెరువులే. ఇక మిగిలిన మండలాల్లో సాగునీటి కాలువలు, చెరువులున్నాయి. 47 సంఘాల పరిధిలో ఎన్నికలు నిర్వహించనుండగా, 32,848 ఎకరాలకు వీటి ఆధ్వర్యంలో సాగునీరందుతుంది. భూమి, ముఠా కాలువలు, చెక్ డ్యామ్‌లు, జలాశయాలతో పాటు 100 ఎకరాలకుపైగా ఆయకట్టు ఆధారపడి ఉన్న చెరువులకు ఎన్నికలు జరగనున్నాయి.


చీడిక జలాశయం

▼ఎలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం, రాంబిల్లి, ఎలమంచిలి, మునగపాక మండలాల పరిధిలో 39 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఎలమంచిలి మండలం పులపర్తి కాలువ పరిధిలో సుమారు 2450 ఎకరాలు ఉంది.

వనరుల అభివృద్ధి

చాలా ఏళ్ల కిందట సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. తర్వాత వీటి ఊసేలేదు. ప్రధానంగా సంఘాలుంటే వాటి పరిధిలో సాగునీటి వనరుల అభివృద్ధికి నిధులు వస్తాయి. పాయకరావుపేట తాండవ నది నుంచి నక్కపల్లి మండలానికి అనుసంధానంగా ఉన్న భూమి కాలువలు పూర్తిగా దెబ్బతిని, పూడికతో ఉన్నాయి. చీడిక జలాశయం వద్ద భారీగా తుప్పలు పెరిగిపోయాయి. వనరుల అభివృద్ధి మొత్తం సంఘాలే చేసుకుంటాయి.


కృష్ణాపురం పంట కాలువ ఇలా..

మార్గదర్శకాల ప్రకారమే ముందుకు..

సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాల ప్రకారం ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నాం. తహసీల్దార్ల నుంచి ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితాలను తీసుకోవాల్సి ఉంటుంది. సాగునీటి సంఘాల వివరాలను సేకరించాలని ప్రభుత్వం నుంచి ప్రాథమికంగా ఉత్తర్వులు వచ్చాయి. ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలకు అనుగుణంగా ముందుకెళ్తాం. – **సుజాత, జలవనరుల శాఖ డీఈ, ఎలమంచిలి**

జాబితాల తయారీ



రికార్డుల ఆధారంగా ఓటరు జాబితాలు తయారు చేసి రెవెన్యూ అధికారులకు పంపించాం. సంఘాలు ఏర్పాటైతే వనరుల నిర్వహణలో జవాబుదారీతనం పెరుగుతుంది. ఈ ఎన్నికలను వచ్చే నెల 24లోగా పూర్తి చేయాలనే ఆదేశాలున్నాయి. – **ఎస్.జగదీశ్వరరావు, డీఈ, పాయకరావుపేట**

సాంస్కృతిక విప్లవానికి బౌద్ధ ధర్మం ప్రతీక

విశాఖపట్నం, న్యూస్‌టుడే: సాంస్కృతిక విప్లవానికి ప్రతీకగా బౌద్ధ ధర్మం నిలుస్తోందని పలు సంఘాల నేతలు స్పష్టం చేశారు. రామాటాకీస్ దరి అంబేడ్కర్ భవన్‌లో గల బౌద్ధ విహార్‌లో అశోకుని బౌద్ధ విజయదశమి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, రమాబాయి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బుద్ధ విహార్‌లో బుద్ధుని విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి బుద్ధ వందనం చేశారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం బౌద్ధ ధర్మ పీఠానికి చెందిన పూజ్య భంతే అనాలయో బౌద్ధ సందేశాన్ని ఇచ్చారు. ప్రపంచ మానవాళి శాంతి, సామరస్యం, సౌభాగ్యాలకు బౌద్ధ ధర్మమే శరణ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ బుద్ధ విహార్ కన్వీనర్ బత్తుల గౌతం బాబు, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు కల్యాణ్‌రావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బౌద్ధ విహార్‌లో విజయదశమి సందర్భంగా మాట్లాడుతున్న పూజ్య భంతే అనాలయో

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల


మండపం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వైభవంగా పైడిమాంబ విగ్రహ ప్రతిష్ఠోత్సవం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: చిన్నప్పన్నపాలెంలో పైడిమాంబ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు, హోమాలు, వేదమంత్రోచ్ఛరణలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సాయంత్రం తిరువీధోత్సవం నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి పండ్లు, మిఠాయిలు, చీర, జాకెట్, పసుపు, కుంకుమ ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు.

మట్టి తవ్వకాల కట్టడికి ఫిర్యాదు

రోలుగుంట, న్యూస్‌టుడే: రొంగలపాలెం శివారు తమరానపాలెంలో మట్టి అక్రమ తవ్వకాలు జరగకుండా కట్టడి చేయాలని కోరుతూ పలువురు రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసు స్టేషన్, తహసీల్దార్, గనుల శాఖ కార్యాలయ అధికారులకు ఫిర్యాదు ప్రతులు అందజేశారు. రోజూ రాత్రి సమయంలో పరిమితికి మించిన లోడుతో టిప్పర్లు కుసర్లపూడి - నర్సీపట్నం మార్గంలో తిరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై గనుల శాఖ సహాయ సంచాలకులు శివాజీని సంప్రదించగా.. రాత్రి సమయాల్లో దాడులు చేయలేమన్నారు. పోలీసులు లారీలను అడ్డుకుని అప్పగిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారులకు ఫిర్యాదు చేసిన వారిలో తమరాన అప్పలనాయుడు, శ్రీను, కేతిరెడ్డి రంగ, చిటికెల సత్యవతి ఉన్నారు.

సంత.. చెత్తతో చింత



తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు దొరుకుతాయని ఎక్కువ మంది వారపు సంతలకు వస్తుంటే.. పరిసరాలన్నీ కంపుకొడుతున్నాయి. సంత ఆశీలు ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తున్నా పరిసరాల శుభ్రత, పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. గొలుగొండ మండలం ఎ.ఎల్.పురంలో ప్రతి సోమవారం వారపు సంత జరుగుతుంది. మేజరు పంచాయతీగా ఉన్న ఇక్కడ ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించకపోవడంతో కుళ్లిపోయి దుర్గంధం వెలువడుతోంది. వాటి మధ్యనే కూరగాయల క్రయవిక్రయాలు చేసేందుకు రైతులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



– న్యూస్‌టుడే, గొలుగొండ

నాతవరం మండల కేంద్రంలో వారపు సంత జరిగే స్థలమిది. ఊరంతా సేకరించిన చెత్తను పంచాయతీ ఇక్కడ పడేస్తోంది. ప్రతి మంగళవారం ఇక్కడ జరిగే సంతకు 30 గ్రామాల నుంచి వస్తుంటారు. ఆశీలు రూపంలో వారం వారం రూ.వేలల్లో జమవుతున్నా.. ఈ దుస్థితేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించకపోతే సభాపతి ఆశ్రయిస్తామని పలువురు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, నాతవరం

పాఠశాల చెంతనే..

మాకవరపాలెం మండలం తాడపాల వీధుల్లో పోగయ్యే చెత్తను ప్రాథమిక పాఠశాలకు 20 అడుగుల దూరంలో పడేస్తున్నారు. వ్యర్థాలు కుళ్లి వర్షం పడితే పాఠశాల వరకు దుర్గంధం వస్తోంది. ఈగల వ్యాప్తితో మధ్యాహ్న భోజనం చేసేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– న్యూస్‌టుడే, మాకవరపాలెం



ఎన్నాళ్లీ ఇబ్బందులు



చోడవరం పట్టణంలో పలు ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. కోటవీధి, పరదేశమ్మ గుడి వెనుక నివాసం ఉంటున్న వారంతా ఇబ్బందులు పడుతున్నారు. రెండు అడుగుల గొయ్యి తవ్వి అందులో బిందెలు ఉంచి కుళాయి నీటిని పట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పాలకులు స్పందించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చోడవరం

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **విశ్వం, మార్టిన్** ఆడి2: **జిగ్రా, శ్వాగ్, మా నాన్న సూపర్ హీరో** ఆడి3: **దేవర,** ఆడి4: **వేట్టయన్, జనక అయితే గనక** రాజు: **వేట్టయన్** బంగార్రాజు: **దేవర,** చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **వేట్టయన్** సాయిలక్ష్మి: **శ్వాగ్,** పూర్ణా: **దేవర**

అ వీ ఇ వీ

పెద్దేరు నీరు విడుదల

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దేరు జలాశయ నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరిందని పర్యవేక్షణాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో ఎప్పటికప్పుడు ఇన్‌ఫ్లోను గమనిస్తూ దిగువకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 214 క్యూసెక్కులు ఉండగా.. 120 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేస్తున్నామన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే రాక

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: కేజేపురంలో మంగళవారం జరగనున్న పల్లె పండుగ కార్యక్రమానికి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరుకానున్నారని తెదేపా మండల అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, కార్యదర్శి ఉండూరు దేముడు తెలిపారు. తాటిపర్తి, శంకరం పంచాయతీల్లో ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారని చెప్పారు.

17న చోడవరం మండలంలో..

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం మండలంలో ఈ నెల 17న పల్లె పండుగ కార్యక్రమం జరగనుందని తెదేపా మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ చెప్పారు. గంధవరం పంచాయతీ నుంచి ప్రారంభమై రాత్రి 9 గంటలకు చాకిపల్లిలో ముగియనుందన్నారు.

నేడు, రేపు వార్డు సభ్యులకు శిక్షణ

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు మంగళ, బుధ వారాల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాంబశివరావు తెలిపారు. కె.కోటపాడులో జరిగే ఈ తరగతులకు 17 పంచాయతీలకు చెందిన వారంతా హాజరుకావాలని కోరారు.

చోడవరం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో ఈ నెల 15 నుంచి 18 వరకు ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు చెప్పారు.

ఎంపీపీ నిధులతో సాగునీటి వసతి

రోలుగుంట, న్యూస్‌టుడే: సాగు భూములకు నీటి వసతి కల్పించేందుకు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు రూ.లక్ష నిధులు కేటాయించారని బుచ్చెంపేట ఎంపీటీసీ సభ్యురాలు ఉలబాల సత్యవతి చెప్పారు. రైతు స్వామినాయుడు పొలంపాకల వద్ద బోరు తవ్వకం పనులను సోమవారం ప్రారంభించారు.

సచివాలయ భవనం ప్రారంభం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఇప్పటివరకు అద్దె భవనంలో కొనసాగిన చౌడువాడ సచివాలయం సోమవారం సొంత భవనంలోకి మారింది. సర్పంచి ఎరుకునాయుడు నూతన భవనంలో పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు రాజేశ్, విశాఖ డెయిరీ డైరెక్టరు గంగాధర్, పాల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, శ్రీనివాసరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

భవనాలు శిథిలం.. వీడని నిర్లక్ష్యం

విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో భయం.. భయం | పట్టించుకోని పాఠశాల విద్యా శాఖ

వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో నాడు - నేడు కింద పాఠశాలల అభివృద్ధి కొన్నింటికే పరిమితమైంది. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లోనే పనులు చేశారు. తక్కువగా ఉన్నచోట భవనాలు శిథిలావస్థలో ఉన్నా కనీసం పట్టించుకోలేదు. రెండు విడతల్లో చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం తదితర కారణాలతో చాలాచోట్ల ఇప్పటికీ పూర్తి కాలేదు. సర్కారు మారడంతో అసంపూర్తి భవనాలు మధ్యలో ఆగిపోయాయి.


కొమిరలో పూర్తిగా దెబ్బతిన్న భవనం


కసిరెడ్డిపాలెంలో శిథిలమైన పాఠశాల భవనం

రావికమతం మండలంలో కసిరెడ్డిపాలెం, కొమిర, పెదపాచిల, జి.కొత్తకోట, పిల్లవానిపాలెం, కానాడ, కొత్త కొట్నాబిల్లి, అప్పలమ్మపాలెం, జెడ్.బెన్నవరం,


ఎల్.ఎన్.పురంలో ఇలా..

తోటకూరపాలెం తదితర గ్రామాల్లో 11కిపైగా పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల స్లాబు పెచ్చులు ఊడిపడుతున్నాయి. గోడలు బీటలు వారాయి. ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం కురిస్తే గదులు కారుతున్నాయి. కిటికీలు, తలుపులు చెదలు పట్టి పాడయ్యాయి.

● కసిరెడ్డిపాలెం, కొమిర, పెదపాచిల పాఠశాలల్లో స్లాబు పెచ్చులు పడటంతో గతంలో విద్యార్థులు గాయపడ్డారు. కొమిర పాఠశాలలో 35 మందికిపై విద్యార్థులున్నారు. ఇక్కడి రెండు భవనాల్లో ఒక్కటే బాగుండగా రెండోది దెబ్బతింది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు వసతి చాలక స్థానిక రామాలయంలో తరగతులు నిర్వహిస్తున్నారు. కసిరెడ్డిపాలెం పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైనా ప్రత్యామ్నాయం లేక అందులోనే బోధన కొనసాగిస్తున్నారు. పెదపాచిలలోని రెండు భవనాల్లో ఒకటి పూర్తిగా పాడవగా దాన్ని వినియోగించడం లేదు. దెబ్బతిన్న భవనాలకు మరమ్మతు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎంఈఓ తలుపులు దృష్టికి తీసుకువెళ్లగా.. రావికమతం మండలంలో 51 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. వాటిలో 11 చోట్ల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. వీటి వివరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపుతూ మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు.

– న్యూస్‌టుడే, రావికమతం

ఒప్పంద అధ్యాపకుల సంఘ అధ్యక్షుడిగా రాజేష్



రావికమతం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఒప్పంద అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా వి.ఎల్.వి.రాజేష్ ఎన్నికయ్యారు. కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆయన్ను ప్రిన్సిపల్ సత్యవతి, అధ్యాపకులు, సిబ్బంది సోమవారం అభినందించారు.

క్రమబద్ధీకరించాలని ఆందోళన

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలన్న డిమాండుతో వారంతా నర్సీపట్నంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సంఘ అధ్యక్షుడు బీఎస్ఆర్ శర్మ ఆధ్వర్యంలో పసుపు రంగు బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. డిసెంబరు 4 వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు శర్మ చెప్పారు.

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులు నిరసన తెలిపి ప్రిన్సిపల్ అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు.


ప్రిన్సిపల్ పద్మావతికి వినతిపత్రం ఇస్తున్న ఒప్పంద అధ్యాపకులు

48 పనులకు రూ.5 కోట్లు

చీడికాడ, న్యూస్‌టుడే: తొలి విడతగా చీడికాడ మండలంలో 48 పనులకు రూ.5 కోట్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ హేమసుందరరావు తెలిపారు. ఈ పనులను డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. మండల పరిషత్తు కార్యాలయంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సర్పంచులు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, గుత్తేదారులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ నెల 17న తురువోలు, చెట్టుపల్లి, పెదగోగాడ, జి.కొత్తపల్లి, చీడికాడ, మంచాల, కోనాం, ఎల్బీపట్నం, ఖండివరం గ్రామాల్లో సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. పీఆర్ ఇంజినీర్ పరదేశినాయుడు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

చీడికాడ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని ఎంపీడీఓ హేమసుందరరావు సిబ్బందికి సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకులు సోమవారం ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు. కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉండాలని వారికి సూచించారు.


దాత కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం ప్రతినిధి

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన ఎలిశెట్టి వీరపాత్రుడు, వెంకటేశ్వరి దంపతులు సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సీనియర్ ఉద్యోగి వర్మ స్వామివారి చిత్రపటం అందించారు.

సాగు పట్టాలు ఇవ్వాలని వినతి

నర్సీపట్నం, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ కోటవురట్ల మండలం గొట్టివాడకు చెందిన పలువురు రైతులు ఆర్డీఓ వి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు. సబ్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 వినతులు వచ్చాయి. నర్సీపట్నం శ్రీకన్య కూడలి ప్రాంతంలో తాగునీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కె.రమణబాబు ఫిర్యాదు చేశారు. గొలుగొండ మండలం పాకలపాడులో భూరికార్డులను తారుమారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లాలం నూకరాజు కోరారు.


వినతులు పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణ, తహసీల్దారు రామారావు

రహదారి భద్రతపై అవగాహన

గొలుగొండ, న్యూస్‌టుడే: వాహన చోదకులు రహదారి భద్రతపై తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకోవాలని వెలుగు ఏపీఎం కరుణానిధి సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో రహదారి భద్రతపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం, కారు నడిపే వారు సీటుబెల్టు తప్పక ధరించాలన్నారు. పోలీసు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

స్పందనకు వందనం

విద్యుత్తు బిల్లు తగ్గింపు

గొలుగొండ, న్యూస్‌టుడే: ఏటిగైరంపేటలో టీ దుకాణం నడుపుతున్న నమ్మి రామకృష్ణకు సెప్టెంబరు నెలలో విద్యుత్తు బిల్లు రూ.8,542 వచ్చింది. కేటగిరి-3లో ఉన్న అతడికి ప్రతి నెలా రూ.1100, రూ.1300 మధ్య బిల్లు వచ్చేది. ‘టీ దుకాణం విద్యుత్తు బిల్లు రూ. 8 వేలు’ శీర్షికన ఈ నెల 12న ‘ఈనాడు’లో వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు అధికారులు పరిశీలించి రూ.1712కు తగ్గించారు.


పట్టుబడిన బాణసంచా నిల్వలను పరిశీలిస్తున్న సీఐ రేవతమ్మ

బాణసంచా నిల్వలు స్వాధీనం

గొలుగొండ, న్యూస్‌టుడే: ఏటిగైరంపేటలో అనుమతుల్లేకుండా నిల్వ చేసిన బాణసంచాను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి స్థానిక కిరాణా దుకాణంలో తనిఖీ చేయగా రూ.లక్ష విలువైన సామగ్రి లభ్యమైందని నర్సీపట్నం గ్రామీణ సీఐ రేవతమ్మ చెప్పారు. కేసు నమోదు చేసి బాణసంచా నిల్వలను సీజ్ చేశామన్నారు.

జూద శిబిరంపై దాడి

రావికమతం, న్యూస్‌టుడే: ధర్మవరం శివారు ప్రాంతంలో జూద శిబిరంపై కొత్తకోట పోలీసులు సోమవారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5,840 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు చెప్పారు.


పల్లెల అభివృద్ధికి శ్రీకారం



సింగందొరపాలెంలో శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పైలా ప్రసాదరావు తదితరులు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: పల్లెల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సింగందొరపాలెం, కేజేపురం, ఎ.కోడూరు, పోతనవలస గ్రామాల్లో సోమవారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. నాయకులు పైలా ప్రసాదరావు, రొంగలి మహేశ్, పైడంనాయుడు, మల్లేశ్వరరావు, అమ్మాజీ, సర్పంచులు లక్ష్మి, ఎరుకమ్మ, అక్కునాయుడు, భార్గవి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, జలవనరుల శాఖ డీఈ సత్యంనాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం గ్రామీణం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం: నర్సీపట్నంలో ఆంజనేయస్వామి గుడి నుంచి విద్యుత్తు ఉపకేంద్రం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, తెదేపా మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి శంకుస్థాపన చేశారు. సర్పంచి రాజేశ్వరి, నాయకులు రాజబాబు, అప్పలనాయుడు (బాబులు) పాల్గొన్నారు. కొత్త తూటిపాల, తూటిపాల, తాడపాల, బూరుగుపాలెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సీతా మహాలక్ష్మి, ఏపీవో వరలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షుడు యర్రాపాత్రుడు, రామునాయుడు, నందకిషోర్, స్వామి, చిరంజీవి పాల్గొన్నారు. ఏటిగైరంపేట, కొమిరి, పప్పుశెట్టిపాలెం, పాతమల్లంపేట గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు సర్పంచులు రామకృష్ణ, రాంబాబు, ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కాంతమ్మ శంకుస్థాపన చేశారు. నాతవరం మండలం గునుపూడిలో ఉపాధి హామీ పథకం అధికారులు, స్థానికులు ర్యాలీ చేశారు. గునుపూడి, కొత్తగూడెం, పి.జగ్గంపేటలో రహదారి నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. సర్పంచి సన్యాసిరావు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ, స్వామినాయుడు, చిన్న, భాస్కరరావు, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

రోలుగుంట: పంచాయతీలను దశల వారీగా అభివృద్ధి చేసేందుకు పల్లె పండుగ కార్యక్రమం దోహదపడుతుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. శరభవరం, కొవ్వూరు, కంచుగుమ్మల, అడ్డసరం, జె.నాయుడిపాలెం గ్రామాల్లో పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు, జె.నాయుడిపాలెంలో కస్తూర్బా విద్యాలయాన్ని ప్రారంభించారు. కంచుగుమ్మల కూడలిలో ఆయన్ను స్థానిక నాయకులు సత్కరించారు. పంచాయతీరాజ్ డీఈ ప్రసాద్, ఎంపీడీవో నాగేశ్వరరావు ఎంపీటీసీ సభ్యులు నరేష్, ఎంఈవో జ్ఞానప్రసాద్, నాయకులు చంద్రమౌళి, చంద్రరావు, శ్రీనివాసరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.


రోడ్డు పనుల ప్రారంభంలో జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, నాయకులు శ్రీరంగస్వామి తదితరులు


జె.నాయుడిపాలెంలో కేజీబీవీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

రోడ్డు పనులకు శంకుస్థాపన చేయరూ..

శరభవరంలో రహదారి శంకుస్థాపనకు హాజరైన ఎమ్మెల్యే రాజును అర్ల పంచాయతీ శివారు లోసంగి గ్రామానికి చెందిన గిరిజనులు కలిసి తమ రోడ్డు పనులూ ప్రారంభించాలని కోరారు. లోసంగి, పెదగరువు రహదారి నిర్మాణానికి సీఎంఓ కార్యాలయ అధికారులు స్పందించి ఉపాధి హామీ నిధులు రూ.2.5 కోట్లు మంజూరు చేశారన్నారు. నిధులు మంజూరైనా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజు స్పందిస్తూ త్వరలోనే రోడ్డు నిర్మాణం మొదలవుతుందని చెప్పారు.

ఉన్నది మూలకునెట్టి.. ప్రైవేటుకు పట్టం

రోగులకు తప్పని ఆర్థిక భారం | ఎమ్మెల్యే సారూ.. మీరే స్పందించాలి

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే

అత్యవసర సమయాల్లో పేద రోగులు వినియోగించుకునేందుకు ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాల్సిన అంబులెన్స్‌కు మరమ్మతు చేపట్టకుండా సంబంధిత అధికారులు మూలకు నెట్టారు. అవసరమైనప్పుడు రోగులు ప్రైవేటు అంబులెన్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇది వారిపై ఆర్థికంగా భారం పడుతోంది. చోడవరం ప్రభుత్వాసుపత్రికి 2016లో అప్పటి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అంబులెన్స్ కావాలని కోరగా.. అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమకూర్చారు. ఆసుపత్రికి డ్రైవరు పోస్టు లేకపోవడంతో అప్పట్లో సోమరాజు అనే వ్యక్తిని నియమించారు. కొన్నేళ్లపాటు అంబులెన్స్‌ను అత్యవసర కేసులకు వినియోగించారు. ఏదైనా మరమ్మతు


ఆసుపత్రి గేటు వద్ద ప్రైవేటు అంబులెన్స్

చేయించాల్సి వస్తే ఆసుపత్రి నిధుల నుంచి ఖర్చు చేసే వారు. మూడేళ్లుగా అధికారులు పైసా ఖర్చు చేయకపోవడంతో మరమ్మతుకు గురై మూలకు చేరింది. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పడుతోంది. టైర్లతోపాటు బ్యాటరీ దెబ్బతింది. మరమ్మతుకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుందని అంచనా. నాడు అంబులెన్సు ఏర్పాటుకు చొరవ చూపిన ఎమ్మెల్యే రాజే స్పందించాలని రోగులు కోరుతున్నారు. ఆసుపత్రి వైద్యాధికారి వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. అంబులెన్స్ మరమ్మతుకు నిధుల కొరత లేదన్నారు. డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామన్నారు.


మూలకు చేరిన అంబులెన్స్

చెట్టుపల్లికి హరిత హారం

తురువోలు - చోడవరం రోడ్డు నుంచి చెట్టుపల్లి వెళ్లే దారి పొడవునా పచ్చదనం పరచుకుంది. రోడ్డుకు ఇరువైపులా అటవీ శాఖ బాదం, వివిధ రకాల మొక్కలను నాటడంతోపాటు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. – న్యూస్‌టుడే, చీడికాడ



తవ్వి వదిలేస్తే ఎలా?

జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా పైపులైన్ ఏర్పాటుకు చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో సిమెంటు రోడ్డును సగానికి తవ్వి వదిలేశారు. నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయలేదు. పాఠశాలకు సైకిళ్లపై వచ్చే విద్యార్థులు ఈ గుంత వద్ద అదుపు తప్పి పడిపోతున్నారు. సమస్యను ఏఈ కనకమ్మ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, చీడికాడ



పెందుర్తి

తెరపై ఈనాడు పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం తహసీల్దారుగా బి.చిన్నికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. జిరాయితీ రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా దరఖాస్తు చేసుకున్న తర్వాత పరిశీలించి ఆర్వోఆర్ చట్టం ప్రకారం వారి ఖాతాల్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM - 1 PM)

పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

న్యూస్‌టుడే, పెందుర్తి

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ కూడలి వద్ద అపోలో ఫార్మసీ వెనుక ప్రాంతంలో 224/85/2 స్తంభానికి ఉన్న వీధి దీపం గత రెండు నెలలుగా వెలగడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రాత్రివేళ పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - ఎం.కనకరావు, చినముషిడివాడ

సమాధానం: మీ ప్రాంతంలో వెలగని వీధి దీపానికి త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - శివరామ్ ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

కలుషితం.. కలవరం..

ఫార్మా వ్యర్థ జలాలతో కాలుష్య కాసారంగా పరవాడ

పరవాడ, న్యూస్‌టుడే

మండల కేంద్రం పరవాడలోని చెరువులు, గెడ్డలు ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. రాంకీ ఫార్మాసిటీలో రసాయన వ్యర్థ జలాలు కలవడంతో నీరు నల్లగా మారి దుర్వాసన రావడంతో పాదచారులు, వాహనచోదకులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాల సమయంలో రాంకీ ఫార్మాసిటీకి చెందిన రసాయన వ్యర్థ జలాలను పలు సంస్థలు దొడ్డిదారిన బయటకి విడిచి పెట్టడంతో గెడ్డల ద్వారా చెరువుల్లో చేరి విషతుల్యంగా మారుతున్నాయి. నిబంధనల ప్రకారం ఫార్మాసిటీలోని వర్షపు నీటిని తప్ప మిగతా ఎటువంటి జలాలను బయటికి విడిచిపెట్టరాదు. ఫార్మా సంస్థల నుంచి వెలువడే వ్యర్థ జలాలను రాంకీ సంస్థకు అప్పగించాలి. రాంకీ వాటిని శుద్ధిచేసి సముద్ర తీరంలోకి విడిచిపెడుతుంది. శుద్ధి చేసినందుకు గాను ఫార్మా సంస్థలు నిర్వహణ ఖర్చులు రూపంలో రాంకీకి కొంత మొత్తాన్ని చెల్లించాలి. అయితే నిబంధనలు ఉల్లంఘించి వర్షాలు కురిసిన సమయంలో యథేచ్ఛగా బయటికి విడిచిపెట్టడంతో చెరువులు, గెడ్డ వాగులోని జలాలు నల్లగా మారుతున్నాయి. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పంటలు పండించడం మానేశారు..

రసాయన వ్యర్థ జలాల కారణంగా పరవాడ పెద్దచెరువు, మోల్లోడు గెడ్డవాగు, సన్యాసిచెరువు, పెద్దచెరువు విషతుల్యమయ్యాయి. ఈ నీటితో పొలాల్లో వ్యవసాయం చేయలేకపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పొలాల్లో పనిచేస్తే చర్మ వ్యాధులు, దురదలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు కూడా పనులకు రావడం లేదు. దీంతో పరవాడ ఊరచెరువు రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి నాట్లు వేయడం మానేశారు. భూములు బీడుగా మారాయి. ఫార్మా నీటి కారణంగా ఈ ప్రాంతంలో కాలుష్యం పెరిగి భూగర్భజలాలు కలుషితమవుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వాలాసాల్లో పెద్ద చెరువులోని చేపలు పెద్ద ఎత్తున మృత్యువాత పడ్డాయి. వర్షాలు, మేఘావృతం అయిన సమయంలో రసాయన విష వాయువులను గాల్లోకి విడిచిపెట్టడంతో భరించలేని దుర్వాసన వస్తోందని తమగోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నల్లగా మారిన మోల్లోడు గెడ్డలోని నీరు


రైతులు పంటలు వేయకపోవడంతో బీడుగా మారిన ఊర చెరువు ఆయకట్టు

పీసీబీ తీరుపై అసహనం..

పరవాడ ప్రాంతం కాలుష్య కాసారంగా మారుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు చేసిన సమయంలో పీసీబీ ప్రతినిధులు నీటి నమూనాలు సేకరించి తీసుకుని వెళ్తున్నారే తప్ప అనంతరం వాటి ఫలితాలను బహిర్గతం చేయడం లేదని వాపోతున్నారు. 3 నెలల క్రితం భరణికం మోల్లోడు గెడ్డవాగులోకి పెద్దఎత్తున రసాయన జలాలు చేరడంతో పీసీబీ అధికారులు చేరుకుని వాటిలో రసాయనాల శాతం ఉందని నిర్ధారించారు. ఆ సమయంలో తూతూమంత్రంగా పలు ట్యాంకర్లతో ఆ నీటిని తోడించి రాంకీకి తరలించి చేతులు దులుపుకున్నారు. పరిశ్రమలకు నోటీసులు ఇచ్చామని, ఇటువంటి ఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని అప్పట్లో ప్రకటించారు. మరలా కొద్దిరోజులకే చెరువులు, గెడ్డవాగులు విషతుల్యంగా మారడంతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత, పీసీబీ అధికారులు స్పందించి కాలుష్యం నుంచి పరవాడ ప్రాంతాన్ని కాపాడాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జెడ్సీ హేమావతి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలు పరిష్కారానికి తగుచర్యలు తీసుకుంటామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. 98వ వార్డు అడవివరంలో రహదారి సమస్యను పరిష్కరించాలని, 94వ వార్డు బీసీకాలనీలో కొండమీదకు నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, ఆ కాలనీలో ఎవరికి నచ్చినట్లు వారు రహదారులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని, 96వ వార్డు దోగ్గవానిపాలెంలో అక్రమ నిర్మాణం పనులను నిలుపుదల చేయాలని అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్వో నారాయణరావు, వర్క్స్ విభాగం డీఈ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలను వింటున్న జెడ్సీ హేమవతి


పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులకు ఈనెల 15, 16 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.పద్మజ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమానికి ఎంపిక చేసిన వార్డు సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరు యువకుల అరెస్టు

పెందుర్తి, న్యూస్‌టుడే: రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పెందుర్తి పోలీసులు సోమవారం ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాయుడు తోట దరి అప్పలనర్సయ్య కాలనీకి చెందిన జి.కల్యాణ్ చక్రవర్తి(20) ఈ నెల 12న సాయంత్రం అతడి స్నేహితులు ప్రసన్నకుమార్, ప్రభాకర్‌తో కలిసి అప్పలనర్సయ్య కాలనీలోని వినాయక ఆలయం దగ్గరకు వెళ్లాడు. అప్పటికే అక్కడ జి. వినోద్ (21), కిరణ్(19) మద్యం తాగుతున్నారు. కల్యాణ్ చక్రవర్తి స్నేహితుడు ప్రభాకర్ తనకు బీరు కొనుగోలు చేయమని వినోద్‌ను అడిగాడు. దానికి వినోద్ నిరాకరించాడు. ఆ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇంతలో పోలీసులు రావడంతో వారంతా పారిపోయారు. అనంతరం కొంతసేపటి తర్వాత మరోసారి అక్కడికి చేరుకుని బీరు కోసం గొడవపడ్డారు. ఆ క్రమంలో వినోద్, కిరణ్ కత్తి, కర్రలతో కల్యాణ్ చక్రవర్తి, అతడి స్నేహితులపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించారు. వారికి గాయాలు కావడంతో పారిపోయి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులు వినోద్, కిరణ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇరువర్గాల మధ్య పాత గొడవలు ఉన్నట్లు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు గల్లంతు


యర్ర సన్యాసిరావు (పాతచిత్రం)

వి.జుత్తాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు గల్లంతైన ఘటన పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రెడ్డి అసిరితాత, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి మండలం వి.జుత్తాడ పంచాయతీ పరిధిలోని దువ్వపాలెం గ్రామానికి చెందిన యర్ర సన్యాసిరావు(65) సోమవారం సాయంత్రం బహిర్భూమి కోసం స్థానిక చెరువు వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో ప్రమాదవశాత్తు చెరువులో జారిపడిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అసిరితాత సంఘటన ప్రాంతానికి చేరుకుని వృద్ధుడి ఆచూకీ కోసం ఇద్దరు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు ప్రారంభించారు. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. రాత్రి 9 గంటలు దాటినా వృద్ధుడి ఆచూకీ లభించలేదు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

అ వీ ఇ వీ

అయ్యప్ప ఆలయంలో మండల దీక్షలు ప్రారంభం

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల దీక్షలు ప్రారంభమైనట్లు ఆలయ ధర్మకర్త, గురుస్వామి వాకా చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు సోమవారం ఆలయ ప్రాంగణంలో దీక్షలు స్వీకరించారు. గురుస్వామి చంద్రశేఖర్ చేతుల మీదుగా మాలధారణ చేశారు. అనంతరం భక్తులు అయ్యప్ప స్వామిని శరణుఘోషలు, భజనలతో కొలిచారు. విశేష హారతులిచ్చి ఆరాధించారు.

16 నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈనెల 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయని ప్రోహిబిషన్, ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న సబ్బవరం మండలానికి సబంధించి 8, పరవాడలో 11 మద్యం దుకాణాలకు డ్రా తీయడం జరిగిందన్నారు. సబ్బవరం మండలానికి కేటాయించిన 8 దుకాణాలు స్థానికులకే వచ్చాయన్నారు. చెల్లించాల్సిన మొత్తంలో ఆరో వంతు నగదు చెల్లించిన వారికి తాత్కాలిక లైసెన్సులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన అన్ని పత్రాలు ఇచ్చాక పూర్తిస్థాయిలో లైసెన్సులు ఇస్తామన్నారు.

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: పెందుర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 36 మద్యం దుకాణాలకు సోమవారం వేలం పాటలు జరిగాయి. మొత్తం 924 మంది దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సరోజిని తెలిపారు. నగరంలో కలెక్టర్ పర్యవేక్షణలో లాటరీ తీసి దుకాణాలు కేటాయించామన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం కేటాయించిన తొలి వాయిదాను వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ చెరువులను రసాయన వ్యర్థ జలాలతో కాలుష్యమయం చేస్తున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం అనకాపల్లి డీఆర్వో దయానిధిని కలిసి ఫిర్యాదు చేశారు. ఫార్మా రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా బయటకి విడిచి పెట్టడం వల్ల చెరువులు, గెడ్డవాగులు, భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు.

పల్లెల్లో అభివృద్ధి పరుగులు

ఘనంగా ప్రారంభమైన శంకుస్థాపనలు

పెందుర్తి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని 54 గ్రామ పంచాయతీలను రాబోయే అయిదేళ్లలోపు సంపూర్ణంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 'పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన అభివృద్ధి పనుల శంకుస్థాపనకు పెందుర్తి మండలం ముదపాక పంచాయతీలో ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల క్రితం గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులకు ఒకేసారి తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. నిధులు మంజూరైన నేపథ్యంలో వారం రోజుల పాటు జరిగే పల్లె పండగలో భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్నామన్నారు. సీసీ రహదారులు, డ్రైన్లు, కల్వర్టులు, శ్మశానాల్లో షెడ్లు, ప్రహరీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఆయా పనులన్నీ నెల రోజుల్లోనే పూర్తి చేసి పండగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు కూడా చేస్తామన్నారు. ముందుగా పనులు పూర్తి చేసిన పంచాయతీలకు మరిన్ని నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. తొలిరోజు ముదపాక, గుర్రమ్మపాలెం, వాలిమెరక, ఎస్‌ఆర్‌పురం, గవరపాలెం, గొరపల్లి, పినగాడి, రాంపురం పంచాయతీల్లో శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు, ఈవోపీఆర్డీ గుండు అప్పలరాజు, పీఆర్ డీఈఈ రమణమూర్తి, ఏఈ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యనారాయణ, ఏపీవో గోవింద్, ఏపీఎం ఎస్తేర్‌రాణి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో ఈనెల 15న పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. 15న బంగారమ్మపాలెం, ఆరిపాక, గొట్టివాడ, టెక్కలిపాలెం, వంగలి, అంతకాపల్లి, గాలిభీమవరం, నారపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శంకుస్థాపనలు చేస్తారని ఎంపీడీవో పేర్కొన్నారు.


ఎస్‌ఆర్‌పురంలో శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎంపీపీ నాగమణి, తదితరులు

సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు


బాధితులతో మాట్లాడుతున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పోలీసు సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటంలో అలసత్వం వహించవద్దని ఆదేశించారు. సోమవారం పోలీసు సమావేశమందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 మంది బాధితులు హాజరై తమ వినతులు సమర్పించారు.

అధ్యయన యాత్ర పేరుతో విహారం


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటరు గంగారావు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ జీవీఎంసీ కార్పొరేటర్లు చేపడుతున్న అధ్యయన యాత్రను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జీవీఎంసీలో సీపీఎం ఫ్లోరులీడరు బి.గంగారావు, పార్టీ నాయకులు ఆర్కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనెల 20 నుంచి 27 వరకు యాత్ర నిర్వహించాలని జీవీఎంసీ నిర్ణయించిందన్నారు. ఈ పర్యటనలో అధ్యయనం కోసం కేవలం 3గంటలు మాత్రమే కేటాయించారని, మిగిలిన సమయమంతా విహార యాత్రలకే కేటాయించడం దారుణమన్నారు. ఈ యాత్రను తమ కార్పొరేటరు గంగారామ్ బహిష్కరిస్తున్నారని చెప్పారు. యాత్రను రద్దు చేసి ఈ ఖర్చును ప్రజావసరాల కోసం వినియోగించాలన్నారు. సీఎం, ఉప ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకుని ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో కొలువైన పంచముఖ గాయత్రీ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత ముఖ్య అతిథిగా పాల్గొని అన్న సంతర్పణ ప్రారంభించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమణమూర్తి, శంకర్‌ప్రసాద్, చెన్నాజీ, అప్పలరాజు, మహేశ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత, కమిటీ సభ్యులు

క్షీణించిన పారిశుద్ధ్యం


పేరుకుపోయిన వ్యర్థాలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. ఇక్కడ సుమారు 1839 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీలోని రహదారుల వెంబడి ఎక్కడికక్కడ చెప్పకుప్పలు పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది. కాలువల్లో పూడిక, చెత్త పేరుకుపోయి మురుగు స్తంభించి దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతున్నాయి. గత కొద్దిరోజుల నుంచి వ్యర్థాలను తరలించకపోవడంతో అపరిశుభ్రత నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు వెంబడి పిచ్చిమొక్కలు పెరిగి పాములు సంచరిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. చెత్త నుంచి దుర్వాసన రావడంతో పాటు దోమల బెడదతో కంటినిండా కరవైందని వాపోతున్నారు. చెత్తను శునకాలతో పాటు పశువులు చిందర వందర చేస్తున్నాయని చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 10న మండల స్థాయి అధికారులు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని కాలనీలో తూతూమంత్రంగా చేపట్టారని దీనివల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలనీలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని కాలనీవాసులు కోరుతున్నారు.


రహదారి పక్కన చెత్త

ప్రజాధనానికి.. నిర్లక్ష్యపు పొదలు

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రజారోగ్య పరిరక్షణలో పాలుపంచుకోవాలన్న లక్ష్యంతో జీవీఎంసీ రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన బహిరంగ వ్యాయామ పరికరాలకు నిర్లక్ష్యపు పొదలు అల్లుకున్నాయి. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ఇనుప పరికరాలు లక్ష్యం నెరవేరకుండానే తుప్పుపట్టిపోయే దుస్థితి నెలకొంది. జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని పెందుర్తి గోకాడ చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన బహిరంగ వ్యాయామ పరికరాలు యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.


తుప్పల నడుమ వ్యాయామ పరికరాలు


పిచ్చిమొక్కలతో మూసుకుపోయిన బహిరంగ వ్యాయామశాలకు వెళ్లే మార్గం

తుప్పుపట్టిపోతున్న వ్యాయామ పరికరాలు..

గోకాడ చెరువు వైపు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొన్నారు. చెరువు చుట్టూ పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు, తుప్పలు, తుమ్మ చెట్లు పెరిగిపోయి పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయి. చెరువు గట్టుపై నిర్మించిన నడకదారి పూర్తిగా మూసుకుపోయింది. ధైర్యం చేసి ముందుకు వెళ్లాలన్నా దారి కనిపించని పరిస్థితి. పరికరాలు వినియోగంలోకి లేకపోవడంతో తుప్పుపట్టి రూ.లక్షల ప్రజాధనం వృథాగా పోతోంది. చెరువు గట్టుపై తుప్పలు తొలగించి వ్యాయామ పరికరాలను వినియోగించుకునేలా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. గతంలో మహిళలు సైతం ఇక్కడ వ్యాయామం చేసుకునేవారని గుర్తు చేశారు. ఉదయపు నడకకు వెళ్లేవారు సైతం చెరువు గట్టును వినియోగించుకునే వారని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్వహణ లోపంతో విలువైన సామగ్రి నిరుపయోగంగా మారిందని వాపోయారు. తక్షణమే సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రైతుబజార్లకు నాణ్యమైన టమాటా

జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్‌శాఖ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్

ఈనాడు కథనానికి స్పందన

కంచరపాలెం, న్యూస్‌టుడే: రైతుబజార్లకు నాణ్యమైన టమాటాలను మాత్రమే వినియోగదారులకు విక్రయించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్‌శాఖ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్ తెలిపారు. 'రైతుబజార్లకు కుళ్లిన టమాటా' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సోమవారం కంచరపాలెం రైతుబజారుకు వచ్చి టమాటాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో విశాఖలో రైతుబజార్లకు వచ్చిన టమాటా లోడులో అనంతపురం జిల్లాలో వర్షాలు పడడం వలన కొంత వరకు పాడయ్యాయన్నారు. దెబ్బతిన్న టమాటాను గ్రేడింగ్ చేసి రైతుబజార్లలో నాణ్యమైనవే వినియోగదారులకు విక్రయించాలని సంబంధిత ఎస్టేటు అధికారుల ద్వారా డ్వాక్రా గ్రూపులకు తెలియజేశామన్నారు


టమాటాను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ ఇన్‌ఛార్జి అధికారి రాకేష్ తదితరులు

రతన్‌టాటా మృతికి నివాళి



రతన్‌టాటా చిత్రాన్ని గీసి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామిక వేత్త, సమాజ సేవకుడు రతన్‌టాటా మృతికి సుజాతనగర్ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయిని రమాదేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మైదానంలో రతన్‌టాటా భారీ చిత్రాన్ని గీశారు. ఆయన సామాజిక సేవలను గుర్తు చేసుకుంటూ వందనం చేసి నివాళి అర్పించారు.

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్

సబ్బవరం, న్యూస్‌టుడే: ఏపీ ఒప్పంద అధ్యాపకుల అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సబ్బవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు సోమవారం పసుపు రిబ్బన్లు కట్టుకుని విధులకు హాజరయ్యారు. ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు 114 ప్రకారం గత ప్రభుత్వం ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పి కాలయాపన చేసిందని ఆరోపించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన పత్రాలను ఆవిష్కరించారు.


డిమాండ్లతో కూడిన పత్రాలను ఆవిష్కరిస్తున్న ఒప్పంద అధ్యాపకులు

ఆక్రమిత అసైన్డ్ భూములను అప్పగించాలని వినతి


తహసీల్దారు బి.చిన్నికృష్ణకు దరఖాస్తు అందిస్తున్న బాధితులు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం బంగారమ్మపాలెంలో ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములను కొందరు ఆక్రమించుకున్నారని, వాటిని తిరిగి ఇప్పించాలని బాధితులు సోమవారం సబ్బవరం తహసీల్దారు బి.చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. 1984లో అప్పటి ప్రభుత్వం సర్వేనెంబర్లు 70/6లో 2 ఎకరాలు, 70/22లో 5 సెంట్ల స్థలానికి గ్రామానికి చెందిన వంకర అమ్మతల్లికి అసైన్డ్ పట్టా ఇచ్చారు. అప్పటినుంచి ఈ భూమిని సాగు చేసుకుని ఫలసాయాన్ని అనుభవిస్తూ ఉన్నామని అమ్మతల్లి కుటుంబ సభ్యులు వంకర అర్జున తెలిపారు. ఈ భూమిని అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని వంశపారపర్యంగా వస్తున్న భూమిని తమకు అప్పగించాలని కోరారు.

ప్రమాదకరంగా ఫ్యూజ్‌బాక్స్



దర్పణం

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో రహదారిని ఆనుకుని ఉన్న ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడి స్తంభానికి ఉన్న ఫ్యూజ్ బాక్స్ పిల్లల చేతికి అందేంత ఎత్తులో ఉండటంతో పాటు ఎటువంటి మూత లేకపోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వర్షాల సమయంలో బాక్స్ నుంచి పొగలు వస్తున్నాయని, గతంలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఫ్యూజ్‌బాక్స్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.